హనీబీఎపి

సంపుటి 2, సంచిక 6

మే-జూన్ 2014

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

www.pallesrujana.org

## 'పల్లెసృజన'కు 'కృషి సహయోగ్' జాతీయ అవార్డు





## మట్టిలో మనిషి నూనె మల్లయ్య



## అద్భుత వైద్యుడు అబ్దుల్ కరీం



# సుస్థిరాభివృద్ధికి కట్టుబాట్లు



రాజస్థాన్‌లోని చాలా భూముల్లో అందరికీ సంబంధించిన చెట్లు, పచ్చిక బైళ్ళు వుండి వాటిని కొన్ని ధార్మిక కట్టుబాట్ల ద్వారా రక్షణ కల్పించటం ఆనవాయితీగా వస్తోంది. అలాంటి భూములను 'ఆరాన్' అని పిలిచేవారు. వాటిని దేవుళ్ళు, దేవతల పేరున వదిలేస్తారు. ఒకసారి ఒక వ్యక్తి ఇటువంటి భూమిలో చెట్లు నరుకుతూ పట్టుబడ్డాడు. అతన్ని శిక్షించటానికి గ్రామపంచాయితీ సమావేశమైంది. చాలా తర్జన భర్జనల తర్వాత ఇంతకుముందు ఇచ్చిన తీర్పులని పరీక్షించిన తర్వాత అతనికి మండుటెండలో చెప్పులు లేకుండా నిల్చుని రెండున్నర కిలోల గింజలు పక్షులకు తినిపించాలి అన్న శిక్షను ఖరారు చేసింది పంచాయితీ.

ఈ శిక్షను ఏవిధంగా అర్థం చేసుకోవాలి? ఆధునిక నిర్వహణా సూత్రాలు ఇంత అర్థవంతంగా, సామాజిక స్పృహని కలిగించగలవా? చెప్పులు లేని కాళ్ళతో మండుటెండలో నిల్చోవటం అంటే అతడు చేసిన పనికి తగ్గట్టుగా శిక్షించారు అనుకోవచ్చు. బహుశా వున్న చెట్లను నరికేస్తే తమకీ ఇదే గతి పడుతుంది అని చూసేవాళ్ళకి ఈ శిక్ష గుర్తు చేయటానికై ఉదాహరణగా ఉండొచ్చు. కానీ, పక్షులకి గింజలు అందులో ఇంత మొత్తం తినిపించాలి అని ఎందుకు చెప్పారు? బహుశా చెట్లు పక్షులకి ఆశ్రయాన్ని ఇవ్వటమే కాక, వేర్వేరు ప్రాంతాలనుంచి వివిధ రకాల గింజలని అవి అక్కడికి చేరవేసి, ఆ ప్రాంతం పచ్చదనాన్ని పెంచేవి అన్న సందేశం ఇవ్వటానికా? కొందరు గ్రామస్తులకైతే ఇటువంటి సందర్భాలు పక్షుల లాంటి అల్పజీవులపై మనలాంటి వారి బాధ్యతని గుర్తు చేయటానికి అంటారు. బహుశా ఇంకా ఎన్నో కారణాలు ఉండవచ్చు.

పర్యావరణానికి ఎక్కువ ప్రమాదమున్న ప్రాంతాలలో ఇలా మనంతట మనమే కల్పించుకునే కట్టుబాట్లు ఉండటం ఎంతైనా అవసరం. ఆధునిక చట్టాలవల్ల ఇది సాధ్యం కాకపోవచ్చు. సామాజిక ఆస్తులని కాపాడటానికి, వృద్ధి చేయటానికి మన ప్రవర్తనని శాశించే ఇటువంటి పటిష్టమైన కట్టుబాట్లు ఎంతైనా అవసరం. మీరేమంటారు?

– హనీబీ 7(3), 1996

Vol-2, Issue - 6 PALLE SRUJANA May-June 2014

NIF టోల్ ఫ్రీ నెంబర్
1800 233 5555

# పల్లెసృజన

సంపుటి-2 సంచిక - 6 మే-జూన్-2014


## సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

సంపాదకులు :
జమ్ములమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
శ్రీ జమ్ములమడక శ్రీకర్

కార్టూన్లు :
వెంకట్

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
ఫోన్ : 040- 40029002
సెల్ : 81257 99904
E-mail : narendragrafix@gmail.com



ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555, 98660 01678
E-mail : editor@pallesrujana.org
www.pallesrujana.org


## ఈ సంచికలో...


- మట్టిలో మనిషి, సృజనాత్మక రైతు నూనె మల్లయ్య - 3
- ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లని చట్టబద్ధతతో అమ్మే పద్ధతి - 6
- 11వ చిన్న శోధయాత్ర-జ్ఞానయాత్ర - 7
- గుజరాత్ రాష్ట్రంలోని పల్లె కబుర్లు - 13
- 'పల్లెసృజన'కు 'కృషి సహయోగ్' జాతీయ అవార్డు - 16
- ఆత్మకూరు మెకానిక్ అబ్దుల్ కరీంకు అనుభవం నేర్పిన సాంప్రదాయ వైద్యం - 18
- ఔషధ మొక్కలు - ఉపయోగాలు - 24
- 'పల్లెసృజన' ప్రగతి - 29
- 'పల్లెసృజన'తో ఇంటర్న్‌షిప్‌లు - 30


### కవర్ లోపలి పేజీల్లో ....


హనీబీ కథ
రైతులకోసం రైతులు కనిపెట్టిన ఇన్నోవేషన్లు



## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar,
Virattipathu, Madurai - 625 010.
Tamil Nadu, India.
Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®
e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in


Printed & Published by **Brig. Pogula Ganesham,** Owner and Printed at **M/s Narendra Graphics,** 1-5-1055/2/14, Flat No. 102, B. Block, Silver Springs Residency, Saibaba Nagar, Old Alwal, Secunderabad - 500 010. Ph.: 81257 99904 and Published at 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678. Editor Sri J. Sesimohan.

# కార్పోరేట్ వ్యవసాయాన్ని ఆపగలమా?

గత ఫిబ్రవరి నెలలో 'పల్లెసృజన' సంస్థకు 'మహీంద్ర సమృద్ధి జాతీయ అగ్రి అవార్డు' వారి "కృషి సహయోగ్" పురస్కారాన్ని ఢిల్లీలో పెద్దయెత్తున జరిగిన సమావేశంలో కేంద్ర వ్యవసాయ సహాయ శాఖామాత్యులు అందజేశారు. సంచిక కవరుపై ఈ సందర్భంలో తీసిన ఫోటోను ప్రచురించాం. పల్లెసృజన సంఘం అందరిదీ. వాలంటీర్లతో నడిచే ఈ సంస్థ గత 8 సంవత్సరాలుగా ముందడుగు వేస్తూ గ్రామీణ సృజనాత్మక శక్తిని వెలికితీసి సమాజానికి పంచడానికి కృషి చేస్తున్నది. గుర్తించిన విజయాలు కొన్నే అయినా ముందుకు సాగుతున్నామన్న తృప్తి వుంది. పాఠకుల సహకారంతో భవిష్యత్తులో సమాజానికి క్షేమకరమైన, లాభకరమైన, ప్రయోజనాత్మక, క్రియాశీల ఆలోచనలతో, రైతులకై రైతులే చేసిన పరికరాలు, వారి సృజనాత్మక ప్రయోగాలు వెతికి సమాంతర వ్యాప్తికై అలుపెరుగకుండా కృషి చేస్తామని విశ్వసిస్తున్నాం.

ఢిల్లీలో జరిగిన అవార్డు ప్రదాన కార్యక్రమంలో దేశంలోని వ్యవసాయాధికార రంగంలోని పెద్దలందరూ పాల్గొన్నారు. ప్రధాన వ్యక్తులు- వ్యవసాయ శాఖ కార్యదర్శి, వ్యవసాయ కమీషనరు, వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్లు, దేశంలోని వ్యవసాయ వ్యవస్థ, దాని భవిష్యత్తు గురించి చర్చించారు. 'పల్లెసృజన' ప్రతినిధులు వక్తల దృష్టి కోణాన్ని, జాతీయ పాలసీ దిశను, భవిష్యత్తులో వ్యవస్థాపరంగా వచ్చే మార్పులను గురించి వ్యక్తం చేసిన అభిప్రాయాలు విని ఆశ్చర్యచకితులయ్యారు, దిగ్భ్రాంతితో మూగవోయారు.

ఈ చర్చలో కార్పోరేట్ వ్యవసాయాన్ని సమర్థించడమే కాక జాతీయ పాలసీలను దానికి అనుగుణంగా మార్చి, త్వరలో వ్యవసాయ క్షేత్రాన్ని కార్పోరేట్ వ్యవస్థతో సమీకరించడానికి అన్ని ప్రయత్నాలు జరిగినట్లుగా పేర్కొన్నారు. "దేశానికి మరో ప్రత్యామ్నాయం లేదని, కష్టపడుతూ నష్టపడుతున్న 90 శాతం సన్నకారు రైతులు లాభదాయకంగా వ్యవసాయం చేయడం సాధ్యం కాదని" వారి ఉద్దేశ్యంగా తెలుస్తోంది. రైతు రుణాలు, విత్తనాల సరఫరా, ఎరువుల సబ్సిడీ లాంటివన్నీ విఫలమయ్యాయనీ, సన్నకారు వ్యవసాయదారులు లాభదాయకంగా వ్యవసాయం చేయడం అసాధ్యమన్న నిర్ణయానికి ఏకగ్రీవంగా వచ్చారు. వీరంతా రాజకీయ నాయకులు కాదు, దేశంలోని వ్యవసాయ వ్యవస్థకు దశ, దిశలను నిర్ణయించే అధికారులూ, శాస్త్రవేత్తలు.

మరి దేశంలోని చిన్న రైతులు ఈ మార్పుకు సిద్ధపడి ఉన్నారా? సన్నకారు రైతులను నిర్మూలిస్తే, వారి జీవనాధారం ఏమిటి? దాదాపు 30 కోట్ల మంది రైతులు, గ్రామాలు విడిచి పట్టణాలకు వెళ్ళాల్సిందేనా? అక్కడ వారి భవిష్యత్తు ఏమిటి? లేదంటే రైతులు తమ భూముల్లోనే తాము కూలీలుగా పనిచేయాల్సి వచ్చే రోజు ఎంతో దూరం లేదనిపిస్తోంది. కోట్లాదిమంది రైతులను అయోమయ పరిస్థితుల్లోకి నెట్టేస్తున్నారేమోనన్న ఆవేదన కలుగుతోంది.

'దేశంలో కార్పోరేట్ వ్యవసాయాన్ని ప్రవేశపెట్టడం' అన్న అంశంపై విస్తృతంగా సుదీర్ఘ చర్చ జరగాలి. రైతులకు సంబంధించిన ఈ పాలసీ నిర్ణయంలో వారినీ భాగస్వాములను చేయాలి. గ్రామ గ్రామంలో ఈ చర్చను జరిపి వారి ఉద్దేశ్యాలను సేకరించాలి, ప్రత్యామ్నాయాలు వెతకాలి, వాటిని అమలులో పెట్టి ఫలితాలను గమనించాలి. వీటి విజయాలపై కార్పోరేట్ వ్యవసాయ నిర్ణయం రద్దు చేయాలి.

గత సంపాదకీయాల్లో వ్రాసినట్లుగా రైతులు వ్యవసాయానికి అయ్యే ఖర్చులను నియంత్రిస్తూ, అతి తక్కువ స్థాయిలో ఉంచగల్గితే వ్యవసాయం లాభదాయకం అవుతుంది. రైతుల దారిద్ర్యానికి కారణం వ్యవసాయంలో అధిక పెట్టుబడే అన్నది అందరికీ తెలిసిన విషయం. జనవరి-ఫిబ్రవరి 2014 'పల్లెసృజన' సంచికలో చిత్తూరు జిల్లా రైతు 'మునిరత్నం నాయుడు' అవలంభించిన వ్యవసాయ పద్ధతి సన్నకారు రైతులకు లాభకరంగా ఉంటుందని నిరూపణ అయింది కదా! మరి ఇలాంటి ప్రత్యామ్నాయాలను చర్చించకుండా, పరిశీలించి, అమలు పరచకుండా, వాటి ప్రభావాన్ని గ్రహించకుండా, నేరుగా "కార్పోరేట్ వ్యవసాయమే" దేశానికి మంచిదన్న నిరంకుశ నిర్ణయానికి ఎలా వస్తున్నారు? దీనిని మనమెందుకు ఒప్పుకోవాలి?

వచ్చే తరాలు భూమి స్వంతదారులుగా ఉండాలంటే, వ్యవసాయం చేయాలంటే, ప్రకృతితో సమన్వయంగా వుంటూ జీవనాధారం పొందాలంటే కార్పోరేట్ వ్యవసాయానికి ఎర్రజెండా చూపాలి.

ఈ సంవత్సరంలో రైతులకు ప్రకృతి తగిన వనరులను ప్రసాదిస్తుందన్న ఆశతో....



**భవదీయ**

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

# మట్టిలో మనిషి, సృజనాత్మక రైతు నూనె మల్లయ్య



అవసరాల నుంచే ఆవిష్కరణలు పుడతాయన్నది 'పల్లెసృజన' నమ్ముతున్న గట్టి సిద్ధాంతం. బాగా చదువుకున్న వాళ్ళు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, డాక్టర్లు వారి అవసరార్థం ఏదైనా కొత్తది కనిపెట్టడం గొప్పే అయినా విచిత్రమేమీ లేదు అనిపిస్తుంది. అది వాళ్ళ ధర్మం. కానీ అదే ఏమీ చదువుకోని, సాంకేతికంగా కానీ, శాస్త్రపరంగా కానీ ఏ జ్ఞానమూ లేని వ్యక్తి తన అవసరార్థం ఏదైనా కొత్త పరికరం, పద్ధతి కనుగొన్నాడంటే ఆహా ఎంత గొప్ప ఆవిష్కరణ అనిపిస్తుంది. నిజం కూడా అంతే. సాధారణంగా ఇటువంటి వాళ్ళు రూపొందించిన ఆవిష్కరణ చూసిన తర్వాత అయ్యో ఇంతేనా అనిపిస్తుంది. కానీ ఆ ఆలోచన అతనికి వచ్చి దానిని సాధించటం చాలా గొప్ప విషయం. ఇటువంటిది సాధించిన వ్యక్తే 'నూనెమల్లయ్య'.

కర్నూలు జిల్లా ఆత్మకూరు మండల కేంద్రం నుండి 9 కి.మీ. దూరంలో వున్న గ్రామం 'కొత్తపల్లె'. ఈ గ్రామంలో నివసిస్తున్న 60 యేళ్ళ ఓ విలక్షణమైన రైతు 'నూనె మల్లయ్య'. ఈయన భార్యపేరు ఈశ్వరమ్మ వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆంజనేయులు, రామాంజనేయులు. ఇద్దరూ ఉపాధ్యాయ వృత్తి చేపట్టి వారు పనిచేస్తున్న చోటనే నివసిస్తున్నారు. కొత్తపల్లె గ్రామంలో మల్లయ్యను అందరూ 'సీతయ్య' అని పిలుస్తారు. తను ఎవ్వరిమాటా వినడు అని నవ్వుతూ చెపుతూ వుంటారు. దానికి కారణం మల్లయ్య మహా మొండి, తాను అనుకున్నది సాధించేవరకు నిద్రపోని అసాధారణ రైతు.

మల్లయ్య ఎంతటి మొండి రైతో అని చెప్పటానికి ఓ మచ్చు తునక.... తన గ్రామం సమీపంలో గల పోరంబోకు చాలా కాలంగా బీడుగా, గుట్టలుగా వున్న పొలాన్ని చదును చేసి సేద్య యోగ్యంగా మారుస్తానన్నాడు. పని మొదలు

**త్వరగా వేడెక్కకుండా బావిలోనుంచి నీటిని తోడటానికి ఈ ఆటో ఇంజన్ పనికి రాదా అనుకున్నాడు. దీనికి నీటి పంపును అనుసంధానం చేస్తే తన సమస్య తీరుతుందని నిర్ణయించుకున్నాడు నూనె మల్లయ్య.**

పెట్టాడు. ఈ పొలం పంటలకు పనికి రాదు అని గ్రామస్తులు, కొడుకులు, కోడళ్ళు, భార్య ఎవ్వరు చెప్పినా వినకుండా తాను దీంట్లో నుండే పంట తీస్తాను చూడండి అని మొండి వాదన చేస్తూ తాను అనుకున్నట్లుగా భూమిని చదును చేసి, సేద్యయోగ్యంగా చేసి నిరూపించాడు. అది చూసి అంతా మరోసారి మల్లయ్య సీతన్నే ఎవ్వరి మాట వినడు అనుకున్నారు. అలా తాను అనుకున్నట్లుగా చేయటం అంత సులువుగా ఏం కాలేదు. ఆ పొలానికి దాదాపు ఒకటిన్నర లక్షలు ఖర్చు చేశాడు. అంతా అమ్మో అనుకుంటే దాన్లో వరి వేసి ఎకరాకు 40 బస్తాల సోనా మసూరి వడ్లు పండించి తానేంటో నిరూపించుకున్నాడు. వరి కోతలు కాగానే మళ్ళీ ప్రొద్దు తిరుగుడు పూలు వేశాడు అందులో కూడా మంచి దిగుబడి సాధించాడు. మంచి ఎండాకాలం ఉగాది సమయంలో కూడా పూలచేనుకు నీరు అందించ గలిగాడు అంటే అతని బావిలో నీరు బావుంది కదా దీన్ని ఇంకాస్త లోతుగా తీస్తే ఇక నీరు పుష్కలంగా వుంటుంది, సంవత్సరానికి మూడు పంటలు కూడా పండించవచ్చు అని ఆలోచించి, ప్రస్తుతం ఆ బావినే ఇంకా లోతుగా జె.సి.బి. యంత్రం హాయంతో లోతు చేస్తున్నాడు మల్లయ్య.

**దాదాపు ఒకటిన్నర లక్షలు ఖర్చు చేశాడు. అంతా అమ్మో అనుకుంటే దాన్లో వరి వేసి ఎకరాకు 40 బస్తాల సోనా మసూరి వడ్లు పండించి తానేంటో నిరూపించుకున్నాడు. వరి కోతలు కాగానే మళ్ళీ ప్రొద్దు తిరుగుడు పూలు వేశాడు అందులో కూడా మంచి దిగుబడి సాధించాడు.**

కష్టానికి వెరవని మల్లయ్యకు నాలుగెకరాల పొలం వుంది. అందులోనే ప్రభుత్వ సహాయంతో 'ఫాం పాండ్' నిర్మించుకున్నాడు. దాని నుండి నీటిని పొలానికి ఉపయోగించడానికి కొంతకాలం పాటు ఆయిల్ పంపును కిరాయికి తెచ్చుకుని ఒక సంవత్సరం పంట పండించాడు. అయితే ఆ సంవత్సర కాలం అతను పడిన కష్టం అంతా ఇంతా కాదు. ఆయిల్ ఇంజన్‌ను వేరేవారి వద్దనుండి కిరాయికి తీసుకు రావటానికి ఒక ఆటో, దాన్ని అక్కడ ఆటోలోకి ఎక్కించడానికి, ఇక్కడ తన పొలం వద్ద దించడానికి అయ్యే శ్రమ, కూలీలఖర్చు తడిచి మోపెడయింది. ఇంతచేసినా ఆ ఆయిల్ ఇంజన్ వేడెక్కటం వలన అప్పుడప్పుడూ ఆపాల్సి వచ్చేది. అలా చేసినా అది హైస్పీడ్ ఇంజన్ కాదు కాబట్టి నీటిని ఎక్కువగా తోడలేదు. ఇన్ని సమస్యలతో పొలంలో పంట ఎలా పండించాలి అని ఆలోచించిన మల్లయ్య ఇలా కాదు తానే ఒక డీజిల్ ఇంజన్ స్వయంగా తెచ్చుకుంటే సరిపోతుంది అన్న నిర్ణయానికి వచ్చాడు. ఎటువంటి ఆయిల్ ఇంజనైతే బావుంటుంది అని ఆలోచిస్తూ తన గ్రామంలో తిరిగే 'ఆప్పే' ఆటోలను గమనించాడు మల్లయ్య. 'ఈ ఆటోలు ఒకేసారి దాదాపు





15-20 మందిని సునాయాసంగా గమ్యానికి చేరుస్తున్నాయి. 20-30 బస్తాల ఎరువులను అవలీలగా మోస్తాయి. త్వరగా వేడెక్కకుండా బావిలోనుంచి నీటిని తోడటానికి ఈ ఆటో ఇంజన్ పనికి రాదా అనుకున్నాడు. ఈ ఇంజన్‌కే నీటి పంపును అనుసంధానం చేస్తే తన సమస్య తీరుతుందని నిర్ణయించుకున్నాడు నూనె మల్లయ్య.

అనుకోవడమేమిటి వెంటనే ఇంట్లోవాళ్ళు, కొడుకులు ఇది అయ్యే పనికాదు అని ఎంత చెప్పినా వినకుండా 20 వేల రూపాయలు జేబులో పెట్టుకుని పక్కనే వున్న ఆత్మకూరు పట్టణానికి వెళ్ళాడు. ఆటోలు రిపేరు చేసే మెకానిక్ దగ్గరకి వెళ్ళి తనకు ఒక ఆటో ఇంజన్ సెకండ్ హ్యాండ్‌ది కావాలి అన్నాడు. కొనేది కొత్తది కాకుండా పాతది ఎందుకని ఎంత చెపుతున్నా వినకుండా బేరమాడి రూ. 6,000 లకు ఒక పాత ఆటో ఇంజన్నే కొన్నాడు. తన మెదడులో వున్న ఆలోచనలని చకచకా అమలు చేస్తూ వంటనే ఒక పంపుసెట్ దుకాణానికి వెళ్ళి ఒక మంచి పంపుసెట్‌ను రూ. 2,500లకు కొన్నాడు. వెంటనే మరో షాపుకు వెళ్ళి ఒక డీజిల్ ట్యాంకును రూ. 650 లకు కొన్నాడు. వీటన్నిటినీ తీసుకుని సమీపంలోని ఓ మెకానిక్ షాప్ వద్దకు వెళ్ళి వీటిని అనుసంధానం చేసి ఒక ఫ్రేములో కూర్చోబెట్టమని అన్నాడు. అతను ఈ ఆటో ఇంజన్‌ని, పంపుసెట్‌ని, డీజిల్ ట్యాంకును ఎగాదిగా చూస్తూ వుంటే నేను చెప్పినట్టు చెయ్ అవుతుంది అని ధీమాగా అన్నాడు. దగ్గరుండి పని చేయించుకున్నాడు. అందుకా మెకానిక్‌కు రూ. 2,500లు ఇచ్చాడు.

ముందే అనుకున్నాం కదా మన మల్లయ్య ఓ సీతయ్య అని. ఆలోచన వచ్చింది, వెంటనే అమలు చేశాడు. అతనీ పని అమలు చేయటానికి కేవలం కొన్ని గంటలు పట్టింది. ఉదయం 10 గంటలకు మొదలు పెట్టుకుని మధ్యాహ్నం 3 గంటల లోపల పని పూర్తి చేసేశాడు. ఇంకేముంది తాను ఊహించుకున్న పని విజయవంతం కావటంతో ఆనందానికి అవధులు లేకుండా పోయింది. మల్లయ్య ఈ పరికరం తయారీకి ఎవ్వరినీ సలహా అడగలేదు, కేవలం ఒక ఆటో ఇంజను ఎంతో బరువును మోస్తున్నపుడు తనకు నీరు తోడి పెట్టదా అని ఆలోచించి ఈ పంపుసెట్‌ను తయారు చేసుకున్నాడు మల్లయ్య. ఇది తయారు చేయటానికి అతనికి దాదాపు 11 వేల రూపాయలు మాత్రమే ఖర్చయింది. అదే కొత్తది కొంటే 35 నుండి 40 వేల దాకా అవుతుంది. ఇంధనం తక్కువ వాడి, ఎక్కువ నీరు తోడటానికి మాత్రమే కాక, బరువు లేకుండా తేలికగా వున్నందువల్ల ఎక్కడికి పడితే అక్కడికి తీసుకు వెళ్ళటానికి అనువుగా వుంది. ఒక రైతుకు ఇంతకన్నా ఏం కావాలి? అని అంటాడు మల్లయ్య.

ఇప్పుడా పంపుసెట్‌తో కేవలం గంటకు అర లీటరు డీజిల్‌తో పొలం తడుస్తుందంటాడాయన. తన నాలుగెకరాల పొలానికి ఒకే రోజులో నీరునందిస్తుందనీ, ఇంతకు ముందు ఇంజన్‌లా మాటిమాటికీ ఆపాల్సిన అవసరం లేకుండా 24 గంటలు ఆడించినా మోటారు వేడెక్కడం కాని, ఎలాంటి రిపేర్లు గాని లేవని తన ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాడు మల్లయ్య.

నీరు అక్కడిది అక్కడే తోడటానికి గంటకు అర లీటరు డీజిల్ ఖర్చవుతుందని, నీటికి ఇంకాస్త దూరం తీసుకు వెళ్ళటానికి పైపులు వేస్తే మోటార్‌పై లోడు పెరగటం వల్ల ఇంకో పావు లీటరు డీజిల్ అదనంగా ఖర్చవుతుందని అంటాడు మల్లయ్య.

"మొదట్లో ఎందుకింత శ్రమ, ఓ కొత్తది కొనేస్తే



పోయేది కదా" అన్న కొడుకులు తండ్రి సాధించిన దానికి ఏమంటారు? అని అడిగితే.... ఆయన ముందునుంచీ అంతే. ఎవరేం చెప్పినా వినడు. తన మనసుకు తోచింది ఎంత కష్టమైనా, ఎంత ఖర్చయినా సాధించి తీరుతాడు. ఈ పంపు విషయంలో ఖర్చు ఎక్కువ కాలేదు కానీ, ఈయన చేసిన దాన్ని చూడటానికి ఊరివాళ్ళే కాక, పక్క గ్రామాల వాళ్ళు, విలేకర్లు, పేపరు వాళ్ళు వచ్చి చూసి ఈయనని పొగడుతూ వుంటే మాకూ చాలా గర్వంగా ఉంది. నలుగురికి పనికి వచ్చే పని చేశాడు కదా అనిపిస్తుంది అన్నాడు రెండవ కుమారుడు రామాంజనేయులు.

పల్లెసృజన జూన్, 2014లో జరిపిన 11వ చిన్న శోధయాత్రలో మల్లన్న చేసిన అవిష్కరణ మా శోధయాత్రీకుల దృష్టికి వచ్చింది. శోధయాత్రలో పాల్గొన్న ఇంజనీర్లు, విద్యార్థులు ఈ ఆలోచన అమలు చేసిన విధానం చూసి ఆశ్చర్యపోయారు. నీరు పారించటానికి ఒక ఇంజను లేక మోటారు దాంతో పంపు ఉండాలి నిజమే కాని, ఆ ఇంజను ఆటో ఇంజను కావచ్చన్న ఆలోచన ఎవరికీ రాలేదు. హైస్పీడు ఆటో ఇంజన్‌తో రైతన్నకు సులువుగా శ్రమ తక్కువగా నీరు తోడవచ్చన్న ఆలోచన వచ్చిన మల్లయ్య గొప్పవాడు. సులభమైన ఆలోచనతో తక్కువ ఖర్చుతో పరిష్కారం చూపిన రైతు ఇన్నోవేటర్ నూనె మల్లయ్యను పల్లెసృజన అభినందించి సత్కరించింది. వెంటనే అతని ఆవిష్కరణను మీముందు ఉంచుతోంది. 9వ ద్వైవార్షిక పోటీలకు నూనె మల్లయ్య ఆవిష్కరణను ఎన్.ఐ.ఎఫ్.కు పంపింది పల్లెసృజన. ●

**ఇన్నోవేటర్ చిరునామా :**

**నూనె మల్లయ్య, కొత్తపల్లె గ్రామం& మండలం, కర్నూలు జిల్లా. ఫోన్ నెంబర్ : 85007 84241**

## ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లని చట్టబద్ధతతో అమ్మే పద్ధతి

ప్రతి గ్రామస్థాయి ఇన్నోవేటరు వ్యాపారం చెయ్యదలచుకుంటే స్థానిక ప్రభుత్వం ఏర్పరచిన పద్ధతులను తప్పనిసరిగా పాటించాల్సి వుంటుంది. ఇది చట్టబద్ధమైన ప్రక్రియ. ఇన్నోవేటర్లందరూ తమ వస్తువులని (ఇన్నోవేషన్లను) వ్యాపార రీత్యా అమ్మాలనుకున్నపుడు పద్ధతులను సక్రమంగా పాటించాలని 'పల్లెసృజన' కోరుకుంటుంది.. ఈ క్రింది కొన్ని సూచనలు తప్పనిసరిగా పాటించండి.

1. ముందు మీ వ్యాపారం సంస్థకు ఒకపేరు నిర్ణయించుకోండి. ఒక రూ. 500/-ల స్టాంపు పేపరుమీద మీరు మీ భార్య/ నమ్మకమున్న వ్యక్తి తో కలిసి భాగస్వామ్య ఒప్పందాన్ని వ్రాసుకోండి.
2. దాన్ని తీసుకువెళ్ళి జిల్లా కేంద్రంలో గల రిజిస్ట్రారు కార్యాలయంలో తగిన రుసుము చెల్లించి మీ సంస్థను రిజిష్టరు చేయించుకోండి.
3. జిల్లా కేంద్రంలో గల ఆదాయపన్ను శాఖకు లేదా 'మీసేవ' ద్వారా మీ వ్యాపార సంస్థ పేరుమీద పాన్ (పి.ఎ.ఎన్.) నంబరుకై దరఖాస్తు చేసుకోండి.
4. మీ గ్రామంలో లేదా సమీప పట్టణంలో మీ సంస్థ పేరున ఒక జాయింటు బ్యాంకు ఖాతాను తెరవండి. అందులో భాగస్వాములందరూ సంతకం పెట్టేట్లుగా అవకాశం కల్పించుకోండి. సాధ్యమైనంతవరకు గ్రామీణ బ్యాంకులను ఎంచుకోకండి.
5. మీ వ్యాపారము రూ. 50 లక్షలకన్నా తక్కువే వుంటుంది కనుక మీ జిల్లా కేంద్రంలో గల వాణిజ్య పన్నుల శాఖలో 'టి.ఐ.ఎన్' (టిన్) నంబరుకై దరఖాస్తు చేసుకోండి.
6. మీరు చేసిన అన్ని కొనుగోళ్ళపై వ్యాటు మొత్తం (14.5%) చెల్లించి, తగిన రశీదు తీసుకోండి.
7. మీ అమ్మకాలపై సేల్స్ ట్యాక్స్ 2% వినియోగదారుల వద్ద సేకరించి, ప్రతి సంవత్సరం మార్చి 31 లోపల జమచేసిన ట్యాక్స్ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేయండి. టిన్ నెంబరు వ్రాయడం మర్చిపోకండి.
8. స్థానికంగా ఆడిటర్‌ను నియమించుకొని లెక్కలు ఆడిట్ చేయించుకోండి.
9. ఎవరికీ లంచాలు చెల్లించకుండా, సత్వర లాభాల కోసం చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకండి.

**ఇవి కొన్ని ముఖ్యమైన సూచనలు మాత్రమే. పూర్తి వివరాలకు మీ ఆడిటరును, వకీలును సంప్రదించండి**

ఇన్నోవేటరుగా సమాజానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించదలచుకున్న మీరు సత్ప్రవర్తనను కలిగి వుండాలి. చట్ట వ్యతిరేక పనులు చేసి బాధ్యతా రహితంగా ప్రవర్తించవద్దు. ప్రతి ఇన్నోవేటరు మనసా, వాచా, కర్మణా మంచి పౌరులు అనిపించుకోవాలని 'పల్లెసృజన' ఎల్లప్పుడూ కోరుకుంటుంది. మీ ఇన్నోవేషన్లు సమాజానికి త్వరలో చేరాలని ఆకాంక్షిస్తూ. **- ఎడిటర్**

## కర్నూలు జిల్లా ఆత్మకూరు నుండి కపిలేశ్వరం వరకు

# 11వ చిన్న శోధయాత్ర-జ్ఞానయాత్ర

50 కి.మీ. దూరం 9-11 మే, 2014



మీరు మీ జీవితాలతో, ఉద్యోగాలతో చాలా బిజీగా వుంటారు. ఒక్కసారి ప్రపంచాన్ని చూడాలంటే, మనుషులని అర్థం చేసుకోవాలంటే తప్పకుండా 'పల్లెసృజన' నిర్వహించే 'శోధయాత్ర'లో పాల్గొనాలి.

### యాత్రీకుడు సుభాష్ అనుభవాలు......

అది కర్నూలు జిల్లా ఆత్మకూరు బస్టాండు. సమయం ఉదయం 4–30 గంటలు. భోరున వర్షం పడుతుంటే నిద్రమత్తులోనే బస్సు దిగాం. ఒక గంట వ్యవధిలో నా తోటి యాత్రీకులంతా ఒక్కరొక్కరే గుమికూడారు. మాలో విద్యార్థులు, వ్యాపారస్తులు కావాలనుకునేవాళ్ళు, వాలంటీర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, మెకానికల్ ఇంజనీర్లు, వ్యవసాయ శాస్త్రవేత్తలు... ఇలా చాలామందిమి ఉన్నాం. చాలా విభిన్నమైన వ్యక్తుల కలయిక అది. అన్నట్లు చెప్పటం మరిచాను మాలో 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేసిన వ్యక్తి కూడా వున్నారు.

నేను ముందు గ్రామస్థాయి ఇన్నోవేటర్లు అన్నపదం విన్నపుడు ఆశ్చర్యపోయా. గ్రామాల్లో చదువు సంధ్య లేనివాళ్ళు, సైన్సు టెక్నాలజీకి సంబంధించిన ఇన్నోవేషన్లు చేయటం ఏమిటి అని. బ్రిగేడియర్ గణేశం గారి ఆధ్వర్యంలో పల్లెసృజన సంస్థ మన గ్రామ స్థాయిలోని సాంప్రదాయ జ్ఞానాన్ని, అక్కడి ప్రజల ఇన్నోవేషన్లని వెలుగులోకి తీసుకు రావటానికి తోడ్పడుతోంది. గణేశం గారు 35 సంవత్సరాల పాటు సైన్యంలో పనిచేసి, ఉన్నతమైన బ్రిగేడియర్ హెూదాలో పదవీ విరమణ చేశారు. ఆయన ఆలోచన ఒక్కటే... రైతులకి ఏమైనా చేయాలి. వారి అవసరాలకు వారే సమాధానాలు వెతుక్కోవాలి, దానికి మనం సహాయపడాలి. మనమే వారి జ్ఞానానికి, ఇన్నోవేషన్లకి ప్రోత్సాహం కల్పించాలి, వీలైతే వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించాలి. దానిలో లాభం వస్తే అది ఇన్నోవేటర్లకే చెందాలి. జ్ఞానానికి కాళ్ళు లేవు కానీ, మనకున్నాయి కనుక మనమే జ్ఞానాన్ని వెతుక్కుంటూ పోవాలి..... పల్లెలు జ్ఞాన మందిరాలు, ప్రకృతి తల్లిలాంటిది. దాన్ని మనం గౌరవిస్తే





అది మనల్ని ఆదరిస్తుంది..... ఇలాంటివే ఆయన ఆలోచనలు.

ఏడు గంటలైంది. వాన వెలిసింది. బస్టాండంతా నీళ్ళతో నిండిపోయింది. అందరం దగ్గరలోని జిల్లాపరిషత్ పాఠశాల వద్దకు వెళ్ళాం. ఎటువంటి సదుపాయాలు వుండవు అని మాకు తెలియజేశారు కనుక పట్నంలో పుట్టి పెరిగిన మాకు ఇంకా కుతూహలం పెరిగింది. గణేశం గారు మాకు యాత్రలో పాటించాల్సిన నియమాలు...... నియమాలు అనకూడదు.... పద్ధతుల గురించి చెప్పారు. గ్రామీణుల సాధారణ జీవితం అర్థం చేసుకోవాలనుకుంటే నేర్పుదాం అని కాకుండా, నేర్చుకుందాం అన్న దృక్పథంతో మెలగండి. గ్రామస్తులని గౌరవించండి. వాళ్ళు మనకన్నా తెలివైన వారు (వారి పద్ధతిలో) అన్న విషయం గ్రహించండి. ఎవరితో వాదించవద్దు, చూసి, విని తెలుసుకోండి. మనకి నలుగురు గురువులు.... ఒకటి ప్రకృతి, రెండు గ్రామస్తులు, మూడు తోటి యాత్రీకులు, నాల్గవది మనమే అన్న విషయం మరవకండి అని చెప్పారు.

యాత్రలో మేము చూసిన గ్రామాలు, కలిసిన గ్రామస్తులను గమనిస్తే వాళ్ళ మంచితనం, ఆప్యాయత, అమాయకత, జ్ఞానం, వాళ్ళ ఇన్నోవేషన్లు, ఆలోచనలు....... ఆశ్చర్యం వేశాయి. నిజం చెప్పాలంటే అవాక్కయిపోయాం. నిజంగా అన్నీ తెలుసు అనుకునే మనకి తెలిసిందేమిటి అనిపించింది.

నేను తెలుసుకున్న కొన్ని ఇన్నోవేషన్లను గురించి క్లుప్తంగా చెపుతా.....

❀ మల్లయ్య అనే రైతు పొలంలో 40 అడుగుల లోతునుండి నీరు లాగే మోటరు చెడిపోయింది. కొత్తది



కొనాలంటే దాదాపు రూ. 40 వేలు ఖర్చవుతుంది. చవకగా మోటారు ఏవిధంగా ఏర్పాటు చేసుకోవాలి అని ఆలోచించాడు. ఏ మెకానికల్ ఇంజనీర్‌కీ రాని ఆలోచన మల్లయ్యకు వచ్చింది. తన ఊర్లో 7 సీటర్ ఆటోలు మనుషులను, ఎరువుల బస్తాలని అవలీలగా మోసేస్తున్నాయి. దాని ఇంజన్ నా పంపుకి పనికి రాదా! అని ఆలోచించాడు. ఆరువేల రూపాయలు ఖర్చు చేసి ఒక 'ఆప్పీ' ఆటో రిక్షా ఇంజన్ కొన్నాడు మరో రూ. 2,500 దాన్ని బిగించడానికి, మరో రెండువేలు బేరింగులు, బోల్టులు, నట్లు లాంటివి కొన్నాడు. అంతా తయారు చేసుకుని తన పొలంలోని పంపుకి ఏర్పాటు చేశాడు. ఇప్పుడు కేవలం మూడు గంటల్లో ఎకరా పొలానికి నీళ్ళివ్వగలుగుతున్నాను అంటాడు. విచిత్రమేమిటంటే ఇవన్నీ ఒక్కరోజులో చేశాడు. డీజిల్ ఖర్చు తగ్గింది, ఇదివరకులా వేడెక్కితే రెండు గంటలకోసారి పంపును ఆపాల్సిన పనిలేదు. ఎంతసేపైనా పని చేస్తూనే వుంటుంది. ఎక్కడికైనే తీసుకు వెళ్ళేంత వీలుగా బరువు తక్కువగా వుంది. ఇంతకన్నా అతనికింకేం కావాలి. అందుకే అతన్ని గౌరవించి సన్మానించాం. మీరంతా ఇప్పుడు చప్పట్లు కొడుతున్నారు గానీ, అదే నాపని కాకపోయుంటే నా దగ్గరికి ఎవరన్నా వచ్చేవారా? అని నవ్వుతూ అన్నాడు







మల్లయ్య. 'పల్లెసృజన' ఇన్నోవేషన్లనే కాదు, మంచి ఆలోచనలని కూడా గౌరవిస్తుంది అని చెప్పారు బ్రిగేడియర్ గారు.

❀ కొత్తపల్లి గ్రామంలో 'వడ్ల బ్రహ్మయ్య' అనే వడ్రంగిని కలిశాం. ఆయన పెద్ద చెట్టుక్రింద పనిచేస్తున్నాడు. అదే ఆయన షాపు. అతని చేతిలో 'గూటం' (సుత్తిలాంటిది), ఇనుముదో కాకుండా చెక్కతో చేయబడింది. అతను దాన్నే వాడుతాడట. తనే తయారు చేసుకున్నాడట. మామూలు సుత్తికన్నా బాగా పనిచేస్తుంది, దెబ్బలు తాకే అవకాశం లేదు అని చెప్పాడతను. అది ఐదు కిలోల బరువు వుంటుంది అని చెప్పినా ఏమో మాకైతే అలా అనిపించలేదు.

❀ కృష్ణారెడ్డి ఎద్దులబండి చక్రాలకి ప్రత్యేకమైన ఇనుప రిమ్మును తయారు చేశాడు. ఎడ్లబండి చక్రానికి ఇనుప తొడుగు వుంటుంది. కానీ, ఎండాకాలం అది వ్యాకోచం చెంది, చక్రం నుండి ఊడిపోయి చాలా ఇబ్బంది కలిగిస్తూ వుంటుంది. ఎక్కడైనే ఏ ఊర్లోనైనా ఇదే సమస్య. కృష్ణారెడ్డిని కూడా ఈ సమస్య బాధించింది. అతనికి వెల్డింగ్ పనిలో ప్రవేశం వుంది. రిమ్ముకు క్లాంపుల లాంటివి ఆరింటిని వెల్డింగ్ చేసి చక్రానికి బిగించేశాడు. దానితో ఇనుప రిమ్ము ఎంత ఎండాకాలమైనా చక్రం నుండి ఊడిరాకుండా వుంటుంది. ఇతని ఆలోచన బాగా పనిచేయటం చూసి, చుట్టుప్రక్కల గ్రామాలవారు కూడా తమ బండ్లకి ఇతని పద్ధతిలోనే రిమ్ములు తయారు చేయించుకున్నారు. అన్నీ బాగా పనిచేస్తున్నాయి.

❀ బ్రిగేడియర్ గారు చింతకింది మల్లేశం గురించి చెపుతూ తన తల్లి పడే కష్టం చూడలేక 'ఆసు పోయటానికి యంత్రం' కనిపెట్టి దానికి తన తల్లిపేరుతో 'లక్ష్మీ ఆసు యంత్రం' అని పిలవటం ఎంతో బాగా అనిపించింది. ఆ యంత్రం సహాయంతో అతని కుటుంబమే కాకుండా, ఎన్నో వందల కుటుంబాలు ఎక్కువ చీరలను నేసి ఎక్కువ ఆదాయం గడిస్తున్నారట. ఈ యంత్రం వాడేవారంతా 'ఆసు కుటుంబం' గా పిలువబడుతు న్నారట! ఒక్క వ్యక్తి చేసిన ఇన్నోవేషన్ ఇంతమందికి మేలు చేసింది కదా అనిపించింది.

❀ వెంకట కృష్ణ ఒక రసాయనాల క్రిమి సంహారక కర్మాగారంలో పనిచేస్తూ వుండగా ఇన్ని రసాయనాలు మనం తినే ఆహారంలోకి వస్తున్నాయా అని ఆశ్చర్యపోయి, బాధపడి, ఇలా కాదని అతనా ఉద్యోగం వదిలేసి తన ఇంట్లోనే 'తులసి' పేరుతో క్రిమి సంహారక మందులు తయారు చేయటం ప్రారంభిం చాడు. మిత్రుల పొలంలో అది వాడి చూడగా అది





బాగా పనిచేయటం గమనించి, ఇప్పుడు పూర్తి వ్యాపారంలోకి దిగాడు. తాను చెరుకు రసం, కొబ్బరినీళ్ళు, గోమూత్రం, ఇతర పదార్థాలు వాడతానని చెప్పాడు. మీ రహస్యాలన్నీ మాకు చెప్పేస్తున్నావేంటి అని అడిగితే ఇవి అందరూ వాడేవే కానీ అవి ఏవెూతాదులో వాడుతానో అన్నదే నా రహస్యం అని నవ్వేశాడు.



ఇలా ఎన్నో కథలు. ఎంతోమంది ఇన్నోవేటర్లు, అందరూ గ్రామస్థాయికి చెందినవారే, పెద్దగా చదువుకోనివారే. వీరందరి గురించి బ్రిగేడియర్ గారు టీవీలో తన ల్యాప్‌టాప్ ద్వారా చూపించి వివరించారు. వీరంతా ఎంత గొప్పవాళ్ళో కదా అనిపించింది. యాత్రీకులంతా చాలా ప్రేరేపించబడ్డారు. అందరికీ ఏదో చేయాలనిపించింది.

ప్రతి గ్రామంలో చిన్న పిల్లలని, విద్యార్థులని కలిశాము. వారికి పుస్తకాలు, పెన్నులు బహూకరించాము. కాగితం, పెన్ను ఇచ్చి మీకు తోచిన ఆలోచనలు వ్రాయండి అని చెప్పాము. అందరూ వ్రాశారు. ఉత్త కాగితం ఎవరూ వాపసు చేయలేదు. ఎన్నెన్ని ఆలోచనలో వారి చిన్న బుర్రల్లో....! ఇలాంటి భావి భారత పౌరుల చేతుల్లో మన దేశ భవిష్యత్తు సురక్షితం అనిపించింది.

**వడ్ల రామాపురంలో వడ్డెర పని చేసే నింబాసా శోధయాత్రీకులకు కలిశాడు. అతనితో చర్చించిన తర్వాత ఆయనకు శాలువా కప్పి సన్మానం చేస్తూ ఫొటోలు తీసుకున్న వెంటనే ..... శాలువా వాపసు ఇచ్చేశాడు. ఈ శాలువా నీకే అంటే, రాజకీయ నాయకులు ఫొటోలకని ఇచ్చి, ఫొటోలు కాగానే మళ్ళీ తీసేసుకుంటారు సార్ అని చెప్పడంతో అదివిన్న శోధయాత్రీకులు ఆశ్చర్యపోయాడు.**



మా యాత్రలో మాకు బాగా నచ్చింది, మమ్మల్ని రక్షించింది, చాలా చిత్రమనిపించింది 'ప్రకృతి'. చల్లని గాలులు, చిరు జల్లులు, పచ్చని పొలాలు, గాలికి నాట్యం చేసే చెట్లు, మట్టిలో చెప్పులు లేకుండా నడుస్తూ వుంటే వేరే ప్రపంచంలో వున్నట్లనిపించింది. బోరుబావిలో నీళ్ళు త్రాగుతూ చెట్లక్రింద భోజనాలు చేస్తూవుంటే ఎంత బావుందో. పట్నంలోని రణగొణ ధ్వనులు లేకుండా, ప్రకృతి శబ్దాలు సంగీతంలా వినిపించేవి. కోతులు, కప్పలు, నెమళ్ళు, గొర్రెలు, ఎడ్లు...... చాలా బావుంది. రాత్రుళ్ళు నడిచినా, నిద్రపోయినా వెన్నెల మా వెంటే వుంది. ఆరుబయట నిద్రపోతూ వుంటే నక్షత్రాలు మాకు కాపలా కాస్తున్నట్లు అనిపించింది.

యాత్రలో ఒక మామిడి తోపు చూశాం. నా జీవితంలో అంతపెద్ద చెట్లు, అంత తియ్యని పండ్లు చూడలేదు. మూడోరోజు చివరన జాలర్ల గ్రామమైన కపిలేశ్వరం చేరుకున్నాం. క్రిష్ణా నదిలో స్నానం చేస్తూవుంటే కొంగలు, బాతులు మాతో పోటీపడి స్నానం చేశాయి. కాళ్ళకి చిన్న చిన్న చేప పిల్లలు తగులుతూ వుంటే...... ఆ అనుభవమే వేరు మాటల్లో చెప్పలేం స్వయంగా





అనుభవించాల్సిందే.

ఇక నా సహ యాత్రీకుల గురించి చెప్పాలంటే భిన్నత్వంలో ఏకత్వం అంటే ఇదేనేమో అనిపించింది. వేర్వేరు రంగాల నుంచి వచ్చినవాళ్ళం ఒకే ఆలోచనతో కలిసి వున్నాం.

❀ ధనుంజయ ఒక ఇన్నోవేటర్. చిన్న ట్రాక్టరును రూపొందించి, దానికి మెరుగులు దిద్దుతున్నాడు. దానిని గురించి అడిగితే చాలు, ఎన్ని గంటలైనా ఉత్సాహంగా చెప్పుకు పోగలడు.

❀ ముప్పారపు రాజు – 2014 ఎన్నికలలో పోటీ చేశాడు. ఇప్పుడు కాకపోతే ఇంకోసారి గెలుస్తానంటాడు. సమాజాన్ని మరమ్మత్తు చేస్తానంటాడు.

❀ ఏకాంశ్ – నేను పనిచేసే కంపెనీలో పని చేస్తాడు. యాత్ర మొత్తం కలిసే వున్నాం. ఇక్కడి ఇన్నోవేషన్లని మా ఐటి కంపెనీలో జరిగే వాటినీ పోల్చుకుంటూ గడిపేశాం.

❀ పాటూరు రాజేశ్వర్ – మెకానికల్ ఇంజనీర్, ఈ యాత్రలో వాలంటీర్, యాత్ర మొత్తాన్ని వీడియో తీశాడు. ఏదడిగినా సమాధానం చెప్పగలడు అనిపించింది.

❀ రాజ్ జనగం – ఏదైనా ఆలోచనని వ్యాపారంగా మలచాలనుకునే వ్యక్తి. తనలాంటి వారికి సలహాలు, సహాయం అందిస్తూ వుంటాడు.

❀ రెండోరోజు ఐ.సి.ఎ.ఆర్. నుండి సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త డా. వరప్రసాద్ గారు మా యాత్రలో కలిశారు. వ్యవసాయం గురించి, చెట్లు, ఔషధ మొక్కలను గురించి చూపిస్తూ అందరికీ చెప్పాడు.

❀ నవంత్ – కర్నూలులో ఒక ఇంజనీరింగ్ కలాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసరుగా పనిచేస్తున్నారు. వ్యవసాయ పద్ధతులు, పొలాల గురించి మేమడిగిన అన్ని ప్రశ్నలకి చక్కగా సమాధానం చెప్పాడు.

❀ నవీన్ – ఒక ఎన్.జి.ఓ.కి పనిచేస్తాడు. ఈ యాత్రలో వాలంటీర్గా పాల్గొన్నాడు. అతడు నలుగురిని ఉత్సాహపరిచే పద్ధతి చాలా గొప్పగా వుంటుంది.

❀ శివ్, వృశంఖ్, సందీప్, భార్గవ్, రాజీవ్, విశాల్ చిన్నవాళ్ళు. వీళ్ళ చురుకుదనమే యాత్రలో మమ్మల్ని ముందుకు నడిపించింది.

అంతా స్నేహంగా, ఒకరికొకరం సహాయపడుతూ, చర్చించుకుంటూ, విడివిడిగా వచ్చినా మూడురోజుల్లోనే ఒక్కటైపోయాం.

గ్రామస్తులు, గ్రామాల గురించి చెపుతా..... ప్రతిచోట ఎంతో ఆప్యాయంగా ఆదరించారు. ఏ బేషజాలు లేకుండా అమాయకంగా కబుర్లు చెప్పారు. రాత్రుళ్ళు వచ్చి మా భోజనాలు, పడక సదుపాయం గురించి వాకబు చేశారు. చాలా బావున్నాయి అంటే మీ పట్టణ వాసులకి మా పద్ధతులేం నచ్చుతాయి అనేవాళ్ళు. కొందరైతే చేతులు పట్టుకొని మరీ వాళ్ళ ఇళ్ళలోకి లాక్కెళ్ళి కాఫీలు, టీలు ఇచ్చారు. ఏదడిగినా దాపరికం లేకుండా చెప్పేవాళ్ళు. అడిగి మరీ విషయాలు చెప్పించుకునేవాళ్ళు. ఒకచోట చిన్న తమాషా జరిగింది. వడ్ల రామాపురంలో వడ్డెర పని చేసే నింబాసా శోధయాత్రీకులకు కలిశాడు. అతనితో చర్చించిన తర్వాత ఆయనకు శాలువా కప్పి సన్మానం చేస్తూ ఫొటోలు తీసుకున్న వెంటనే ..... శాలువా వాపసు ఇచ్చేశాడు. ఈ శాలువా నీకే అంటే, రాజకీయ నాయకులు ఫొటోలకని ఇచ్చి, ఫొటోలు కాగానే మళ్ళీ తీసేసుకుంటారు సార్ అని చెప్పడంతో అదివిన్న శోధయాత్రీకులు ఆశ్చర్యపోయాడు.



ఒకచోట మేము నీళ్ళు అడిగితే ఆ ఇంటామె మినరల్ వాటర్ ఇచ్చింది. సీసాకి ఖరీదు ఇవ్వబోతే మీకివి అలవాటని ఇచ్చాను. మీరు మాకు అతిథులు, అతిథుల దగ్గర పైసలు అడుగుతామా? అంది.

ఈ మూడురోజుల్లోనే మా అనుభవాలు ఎన్నెన్నో. నా మనసుకి హత్తుకున్న కొన్ని మాత్రం మచ్చుకు చెప్పా.

శోధయాత్ర ముగించుకొని కపిలేశ్వరం నుంచి బస్సులో ఆత్మకూరు చేరుకున్నాం. తిరుగు ప్రయాణంలో అనిపించింది. యాత్రలో కలిసిన వారందరితో విడదీయరాని సంబంధం ఏర్పడిం. బస్సు ప్రయాణం. బయట చీకటి ఏమీ కనిపించటం లేదు. ఆయినా మేము కలిసిన మనుషులు, చూసిన గ్రామాలు, పొలాలు సినిమాలా కనిపిస్తున్నాయి. వీటన్నిటినీ వదిలి వెళ్ళిపోతున్నామా అని తోటి ప్రయాణీకులంటే నేనన్నాను 'అదేం కాదు. ఈ జ్ఞాపకాలన్నింటినీ చిరస్థాయిగా మనతో తీసుకువెళ్ళిపోతున్నాము'.

మిత్రులారా, మీరు మీ జీవితాలతో, ఉద్యోగాలతో చాలా బిజీగా వుంటారు. ఒక్కసారి ప్రపంచాన్ని చూడాలంటే, మనుషులని అర్థం చేసుకోవాలంటే తప్పకుండా 'పల్లెసృజన' నిర్వహించే 'శోధయాత్ర'లో పాల్గొనాలి. వివరాలకి వారి వెబ్‌సైట్ చూస్తూ వుండండి. ప్రపంచం గురించి కాదు, మీ గురించి మీరు తెలుసుకోండి, మీరేం చేయాలో ●










## NIF లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 14 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై ఒక వెబ్‌సైట్ తయారు చేసింది. ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ nifindia.org లో చూడవచ్చు. అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞానంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే **NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555** కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.

# గుజరాత్ రాష్ట్రం నుండి సేకరించిన పల్లె కబుర్లు

લોકસરવાણી
Loksarvani
(Gujarati version of Honey Bee)
SRISTI, P O Box No. 15050
Ambawadi, Ahmedabad - 380015, Gujarat
loksarvani@sristi.org

21101

**పశువుల్లో నులిపురుగుల నివారణకు:**

పశువుల పోషణలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి ప్రేవుల్లో నులి పురుగులు ఏర్పడి అవి తిన్నది అరగక బాధపడుతూ వుంటాయి. అశ్రద్ధ వహిస్తే పశువు క్రమంగా క్షీణించి మరణించే ప్రమాదముంది. పశువులలో నులి పురుగుల నివారణకు బజార్లో చాలా మందులు దొరుకుతున్నాయి. కానీ గుజరాత్ రాష్ట్రం, బరూచ్ జిల్లా, కంబూడి గ్రామానికి చెందిన 'పుల్జీభాయ్ ఉమార్ భాయ్ వాస్వా' మన పెరట్లో దొరికే చెట్లతోనే వీటికి ఉత్తమమైన చికిత్స అందించవచ్చు అంటున్నారు. ఈయన పద్ధతి ప్రకారం 100 గ్రా. వేపాకులు, 100 గ్రా. దానిమ్మ ఆకులను మెత్తగా నూరి, 400 మి.లీ. నీటిలో కలపాలి. ఒక గంట తర్వాత ఆ మిశ్రమాన్ని బాగా కలిపి రోజుకొకసారి చొప్పున రెండు మూడు రోజులు పశువుకు తాగిస్తే నులిపురుగుల నుండి నివారణ పొందవచ్చు అంటున్నాడు.



21102

**పంటలలో రసం పీల్చే పురుగుల నివారణకు:**

ఈ రసం పీల్చే పురుగు ఏ పంటకైనా, మొక్కకైనా సోకి చెట్టు ఆకులలోని రసాన్ని పీల్చేసి మొక్కలను నిర్వీర్యం చేసి అవి నశించిపోయేలా చేస్తాయి. వీటి నివారణకు



గుజరాత్‌కు చెందిన 'పరుషోత్తమ్ భాయ్' చక్కటి, తేలికైన ఉపాయం చెపుతున్నాడు. ఈయన చాలాకాలంగా తన పొలంలో ఇదే పద్ధతిని వాడుతున్నాడట. ఈయన వేపాకులు, మజ్జిగ తేటను ఉపయోగించి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. వేపాకులను నీటిలో వేసి ఆ నీరు మూడవ వంతుకు వచ్చే వరకు మరగబెట్టి, 200 మి.లీ. ఆ కషాయాన్ని తీసుకుని, 1500 మి.లీ. మజ్జిగ తేటలో కలిపి పొలాలపై పిచికారి చేస్తే ఈ రసం పీల్చే పురుగు నుండి నివారణ పొందవచ్చు అని చెపుతున్నాడు.

21103

**వెల్లుల్లి పంటను చీడనుంచి కాపాడటానికి:**

గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'పరుషోత్తమ్ భాయ్' ఈ ఉపాయం కూడా చెబుతున్నారు. భారత సుగంధ ద్రవ్యాల బోర్డు లెక్కల ప్రకారం 2002–2007 మధ్యలో గుజరాత్ రాష్ట్రంలో వెల్లుల్లి ఉత్పత్తి 480 శాతం పెరిగింది. ప్రత్యేకించి జునాగఢ్ జిల్లాలో అత్యంకంగా వెల్లుల్లి పండిస్తుంటారు. ఆ జిల్లాలోని రైతులు వెల్లుల్లి పంటను కాపాడటానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్నిచ్చే సేంద్రియ పద్ధతిని పాటిస్తున్నారు. దాన్ని పరుషోత్తమ్ భాయ్ మనకు తెలియజేస్తున్నారు. మజ్జిగ, గోమూత్రము, కుళ్ళిపోయిన సజ్జలపిండి ఈ మూడింటిని బాగా కలిపి వెల్లుల్లి పంటపై పిచికారి చేసి పంటను చీడల నుండి రక్షించుకోవచ్చు అని చెపుతున్నారు.



ఇంకొక రైతు 'రమేష్ భాయ్' మరో పద్ధతి వాడి తన వెల్లుల్లి పంటను చీడనుండి కాపాడుకుంటున్నాడు. ఆయన ఆముదము, నీరు, బట్టలుతికే సోడను కలిపి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. ఒకటిన్నర లీటర్ల ఆముదము, 100 గ్రా. బట్టలుతికే సోడ, 20 లీటర్ల నీటిలో కలిపి పంటకు నీరు పెట్టిన తర్వాత రెండుమూడు సార్లు పంటపై పిచికారి చేస్తే మంచి ఫలితం వుంటుందని చెపుతున్నారు.

21104

**మిపర పంటను తెగుళ్ళనుండి కాపాడటానికి:**

గుజరాత్‌కు చెందిన 'పరశురామ్ భాయ్' ఈ చిట్కా కూడా చెపుతున్నారు. మిరప పంటను తెగుళ్ళ బారినుండి రక్షించుకోవటానికి ఆయన నిమ్మ, కలబంద, పొగాకులను కలిపి వాడుతుంటాడు. ఆయన 2 కిలోల పొగాకు పొడి, 2 కిలోల కలబంద, 250 గ్రా. నిమ్మరసం లను 20 లీటర్ల నీటిలో కలిపి మరిగిస్తాడు. 250 మి.లీ. ఈ ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి 8 రోజులకొకసారి మిర్చి పంటపై పిచికారి చేస్తాడు. ఈ పద్ధతి వలన మిరప పంటలో 80 శాతం వరకు తెగుళ్ళను నివారించగలిగానని చెపుతున్నాడు.

21107

**వరి, మినుము పంటలలో చీడల నివారణకు:**

వరి మినుము పంటలను చీడలు సోకి చాలా నష్టాన్ని కలిగిస్తుంటాయి. దీని నివారణకు అనేక ఖరీదైన రసాయన పద్ధతులు వాడినా స్వచ్ఛమైన సేంద్రియ పద్ధతి ఒకటి వుంది అంటున్నారు గుజరాత్ రాష్ట్రం లోని బనస్కాంత ప్రాంతానికి చెందిన 'జమాల్ భాయ్ నూరాభాయ్ మోడీ'. ఈయన పులికంప చెట్టు ఆకులు, పొగాకు, రేలకాయలు (రోడ్ల పక్కలో విరివిగా లభించే నల్లని పొడగాటి కాయలు, ఈ చెట్ల పూత పసుపు వర్ణంలో వుంటుంది) ను కలిపి



తయారు చేసుకుంటాడు. రెండు లీటర్ల ద్రావకం తయారు చేసుకోవటానికి ఆయన 200 గ్రా. పులికంప ఆకులు మరియు పూలు, 200 గ్రా. పొగాకు చెట్లు వేర్ల పొడి, 200 గ్రా. రేల కాయల పొడిని మూడు లీటర్ల నీటిలో కలిపి ద్రావకం 2 లీటర్లు అయ్యేంత వరకు మరగబెట్టాలి. ఈ కషాయాన్ని నీటిలో కలిపి పంటలపై పిచికారి చేస్తే మంచి ఫలితముంటుంది.

**బెండ పంటను చీడ పీడల నుండి కాపాడటానికి:**

గుజరాత్ రాష్ట్రంలోని సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా, మాయానగర్ గ్రామ నివాసి 'జనక్ కుమార్ వ్రజిలాల్ చోహాన్' తన బెండ పంటను చీడ పీడలనుంచి కాపాడటానికి స్వయంగా ఓ పద్ధతిని కనుగొన్నాడు. ఈయన మెంతుల పొడిని ఉపయోగించి, ఒక



ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. ఇది వాడటం వలన మంచి ఫలితం వుంటుంది అని చెపుతున్నారాయన. దీనికై ఆయన మెంతులను మెత్తగా నూరి పొడి చేసుకుని, ఒక కిలో పొడిని నీటిలో కలిపి మూడు రోజులపాటు మురగనిస్తాడు. మూడు రోజుల తర్వాత ఈ పొడి కొంత చిక్కగా, జిగురుగా మారుతుంది. ఆ చిక్కటి ద్రావకాన్ని మెత్తని చీపురుతో పంటపై చిలకరిస్తాడు. ఈ మెంతులకి వున్న ప్రత్యేకమైన వాసన చీడపీడలను, పురుగులను మొక్కల దగ్గరికి రానీయదు.

**ఆకుముడత పురుగు నివారణకు:**

చాలా రకాల పంటలలో ఆకుముడత తెగులు పంటకు ఎంతో నష్టాన్ని చేకూరుస్తుంది. ఈ తెగులు ప్రత్యేకించి, చలికాలం, మేఘావృతమైనప్పుడు ఎక్కువగా సోకుతుంది. దీని నివారణకు గుజరాత్ రాష్ట్రం, సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా, దేవీపూర్ గ్రామ నివాసి 'మహేష్ భాయ్ జయరామ్ భాయ్ లఖాత్రియా' గన్నేరు చెట్లను ఆశ్రయిస్తాడు. ఇది పూర్తి సేంద్రియ పద్ధతే అని చెపుతాడాయన. ఆయన రెండు కిలోల గన్నేరు ఆకులను తీసుకుని, మెత్తగా నూరి ముద్దచేసి, ఆ ముద్దను 5 లీటర్ల నీటిలో కలిపి ఐదారు రోజులపాటు మురగబెడ్తాడు. తర్వాత ఈ ద్రావకాన్ని కొద్దిసేపు మరిగించి, 150 మి.లీ. ఈ మరిగించిన ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి పంటపై ఆకులు క్రింద భాగానికి తగిలేలా పిచికారి చేస్తాడు. దీంతో ఆకుముడత తెగులు సమర్థవంతంగా అరికట్ట బడుతుంది అంటారు. ఈ ద్రావకాన్ని మురగబెట్టేటపుడు గాలి పారకుండా మూత పెడితే త్వరగా మురిగిపోతుందట. ఈద్రావకం బూజు తెగులుకు కూడా బాగా పనిచేస్తుంది అంటారాయన.



# మహేంద్ర సమృద్ధి 'కృషి సహయోగ్' అవార్డుతో 'పల్లెసృజన'కు జాతీయ గుర్తింపు




భారతదేశంలో 'మహేంద్ర' కంపెనీ పేరు తెలియని వారు ఉండరు. ఆ కంపెనీ కేవలం ట్రాక్టర్లను తయారు చేయటం మాత్రమే కాక, వ్యవసాయ సంబంధ పనిముట్లను కూడా తయారు చేస్తుంది.

భారత వ్యవసాయ రంగం సమృద్ధిగా ఉండాలంటే వ్యవసాయదారులకి సరైన, సులువైన వ్యవసాయ పరికరాలను అందుబాటులోకి తీసుకు రావాలి. ఈ దిశలో 'మహేంద్ర' కంపెనీ 2011లో వ్యవసాయ రంగ అభివృద్ధికి పాటుపడ్డ వ్యక్తులను, సంస్థలని గుర్తించి 'మహేంద్ర సమృద్ధి ఇండియా అగ్రి అవార్డ్స్' పేరున సత్కరించాలని నిర్ణయించింది.

2013వ సంవత్సరానికి గాను వ్యవసాయ రంగానికి ఇతోధికంగా సేవలందిస్తున్న 'పల్లెసృజన'ను గుర్తించి 'కృషి సహయోగ్' 'రన్నరప్' అవార్డును ప్రకటించడం జరిగింది. న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శ్రీ తారీఖ్ అన్వర్ చేతులమీదుగా 'పల్లెసృజన' అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం గారు, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి దుర్గాప్రసాద్ గారు స్వీకరించారు.

'పల్లెసృజన' గ్రామీణ జ్ఞాన వ్యాప్తికై చేస్తున్న సేవకి ఇది గుర్తింపుగా భావించి దీనివలన తమ బాధ్యత మరింత పెరిగిందని భావిస్తూ వినమ్రతతో ఈ అవార్డును స్వీకరిస్తూ ఈ శుభవార్తను పాఠకుల దృష్టికి తీసుకు వస్తున్నాం. సహకరించిన వాలంటీర్లకు, రైతన్నలకు, గ్రామీణ ఇన్నోవేటర్లకు కృతజ్ఞతాభివందనలు.

– ఎడిటర్, పల్లెసృజన











### ఆత్మకూరు మెకానిక్ అబ్దుల్ కరీంకు అనుభవం నేర్పిన

# సాంప్రదాయ వైద్యం



కర్నూలు జిల్లా ఆత్మకూరు మండల కేంద్రం (ఒకప్పటి తాలూకా కేంద్రం) లో తన తెలివి తేటలతో ఎటువంటి యంత్రాన్నయినా సునాయాసంగా, విజయ వంతంగా రిపేరు చేస్తూ పరిసర ప్రాంతాలలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్న వ్యక్తి 60 సంవత్సరాల అబ్దుల్ కరీం. ఆయన తండ్రి వృత్తిరీత్యా ఓ కుట్టు మిషన్లు రిపేరు చేసేవాడు. బ్రతుకు తెరువుకై సమీపంలోని 'పారుమంచాల' గ్రామం నుండి ఆత్మకూరుకు వచ్చి స్థిరపడ్డాడు. కరీం కూడా తండ్రిదగ్గర అదే విద్యను అభ్యసించి తాను కూడా మెకానిక్‌గా మారాడు. అది ఆయనకు ఎక్కువ ఆనందాన్ని ఇవ్వక పోవడం వల్ల ఇంకా పెద్ద మెకానిక్‌గా మారాలని నిశ్చయించుకొని తన మిత్రుడు అబ్దుల్ ఖాదర్‌తో కలిసి ఒక మెకానిక్ షెడ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అది దిన దినాభివృద్ధి చెంది ఇప్పుడు ఆత్మకూరు పట్టణంలో లారీలు, ట్రిప్పర్లు, ఆయిల్ ఇంజన్‌లు, ఆటోలు, ఇంటిపనులకు వినియోగించే ఎటువంటి మెకానిక్ పనులనైనా చేసే వర్క్‌షాప్‌గా పేరు తెచ్చుకుంది. ఇదంతా కరీం కృషి ఫలితమే. ఎవరైనా ఇది ఇక రిపేరుకు కూడా పనికి రాదు అని అంటే దాన్ని నేను రిపేరి చేసి పెడతాను అంటా కరీం. మిత్రులిద్దరూ మంచి పనితనంతో ఎటువంటి రిపేర్‌నయినా విజయవంతం గా పూర్తిచేస్తారనే మంచి పేరు సంపాదించు కున్నారు. వీరి తర్ఫీదులో ఇప్పుడు కరీం కుమారుడు కూడా మంచి మెకానిక్‌గా అభివృద్ధి చెందుతున్నాడు.

కరీం సంతానంలో మొదటి బిడ్డకు ఒక అంతుబట్టని వ్యాధి సోకింది. తనకున్న ఆర్థిక స్థోమతతో ఎందరెందరో డాక్టర్లకు చూపినా నయం కాలేదు సరికదా ఇక ఈ బిడ్డ బ్రతకడం కష్టమని డాక్టర్లే తేల్చివేశారు. సరే కన్నందుకు ఆలనా పాలనా చూడక తప్పదు కదా అని ఆ

**జీవన విధానానికి ప్రాధాన్యతనిస్తూ, ఆయుష్షును పెంచుకునే మార్గాలకు బాటలు వేసిన మహిమాన్విత సంపద మన ఆయుర్వేదం అని, ఈ వారసత్వ సంపదను కాపాడుకోవటం ప్రతి వ్యక్తి బాధ్యత అంటారు కరీం.**



బిడ్డను ఇంటికి తెచ్చుకుని తనకున్న పరిజ్ఞానంతో ఈ ఇంగ్లీషు వైద్యం కన్నా సాంప్రదాయ వైద్యం వల్ల ఏమైనా బాగవుతుందేమో అన్న చిన్న ఆశతో ఎన్నో రకాల ఆయుర్వేద గ్రంథాలను సమకూర్చుకుని వాటిని నిశితంగా చదివి, అర్థం చేసుకుని, వాటిలో వున్న జ్ఞానానికి తన స్వంత ఆలోచనలను జోడించి, ఎన్నో రకాల వైద్యాలను చేసి తన కొడుకును కొంతకాలం పాటు బ్రతికించుకో గలిగాడు. కాని విధిని తప్పించలేక పోవటం వల్ల పుత్ర శోకంతో కాస్త కుంగి పోయాడు. ఈ మాటలు అంటున్నపుడు పుత్రుని జ్ఞాపకాలతో ఉద్వేగానికి లోనయ్యాడు.

సరే భగవంతుని ఆలోచన ఇలా వుంది అనుకుని చనిపోయిన కుమారుడ్ని తలుచుకుంటూ క్రుంగిపోక, వృత్తిపరంగా తన మెకానిక్ వృత్తిపై శ్రద్ధ వహిస్తూనే ఎప్పుడో చనిపోతాడనుకున్న తన కొడుకును ఇంతకాలం పాటు బ్రతికించుకునేలా చేసిన సాంప్రదాయ వైద్యాన్ని విస్మరించకూడదు అనుకున్నాడు. తనలాంటి ఎందరో దురదృష్టవంతులకు కాస్త స్వాంతన చేకూరిస్తే చాలు తన జన్మ ధన్యమైపోతుందని భావించాడు. ఆయుర్వేదంపై మరింత పట్టు సాధించాలనే సంకల్పంతో మరిన్ని గ్రంథాలను చదివి, అనుభవజ్ఞుల వద్ద తెలుసుకుని ప్రస్తుతం మెకానిక్ గానే కాకుండా ఒక పరిపూర్ణమైన వైద్యుడుగా కూడా చుట్టుపట్ల గ్రామాలే కాదు, ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో కూడా పేరు ప్రఖ్యాతులను సంపాధించుకున్నాడు కరీం భాయ్.

మానవులకు ఆయుష్షును, ఆరోగ్యాన్ని ప్రసాదించేవి చెట్లు అని, ఆయుర్వేద వైద్య సంపద మనకు మహర్షులు అందించిన ఒక అద్భుత వరమని అంటాడు కరీం. ఒక్క వైద్యమే కాదు, జీవన విధానానికి ప్రాధాన్యతనిస్తూ, ఆయుష్షును పెంచుకునే మార్గాలకు బాటలు వేసిన మహిమాన్విత సంపద మన ఆయుర్వేదం అని, ఈ వారసత్వ సంపదను కాపాడుకోవటం ప్రతి వ్యక్తి బాధ్యత అంటారు కరీం. వైద్య విధానంలో ఆధునిక పరిశోధనలు ఎన్ని వచ్చినా ఆయుర్వేదం తన విశిష్ఠతను చాటుకుంటూనే వుంది అంటారాయన.

ఆయుర్వేదానికి అవసరమైన మొక్కలు ఎక్కడో పెద్ద పెద్ద అడవుల్లోనో వుంటాయి అనుకోవటం పొరపాటు అని, అవి ప్రతి గ్రామంలో పట్టణంలో ఉన్నాయని, కాని వాటిని గుర్తించి సరైన పద్ధతిలో వాడితే ఎన్నో రుగ్మతలు అతి తక్కువ ఖర్చుతో, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు లేకుండా నయం చేయవచ్చు అంటారు కరీం. అందుకై ప్రతి పట్టణంలో ఆయుర్వేద మేలాలు ఏర్పాటు చేసి వాటిని మానవాళికి అర్థమయ్యేలా చెప్పడం మంచి పద్ధతి అని ఆయన ఉద్దేశ్యం. తాను వనాల వెంట నడుస్తుంటే చెట్లు నాతో మాట్లాడుతున్నట్లు అనిపిస్తుందని చిలిపిగా అంటారు కరీం.

మన సాంప్రదాయాలలో మనకి తెలియని ఎన్నో విషయాలను గురించి చెపుతారాయన. మన పెరటిలో భగవంతుని ప్రతిరూపంగా 'తులసి'ని ఎందుకు పూజిస్తారో తెలుసా, అందులో అద్భుతమైన ఔషధ గుణాలుండటం ఒకటైతే, తులసి మొక్కను పూజిస్తున్న ఇంట్లో ఎన్నిరోజులు నివసిస్తే అన్ని వేల సంవత్సరాలు ఆ వ్యక్తి వైకుంఠంలో గౌరవింపబడతాడు అన్నది కొందరి నమ్మకం అంటారు ఆయన. ఇలాంటివి ఎన్నో విశేషాలు చెప్పుకొచ్చారాయన. ఉదా.: శివునికి ఇష్టమైన బిల్వ (మారేడు) వృక్షాన్ని పెంచిన వ్యక్తి కుటుంబంలో లక్ష్మీదేవి తరతరాలుగా నివసిస్తుందని, వేప చెట్టు నాటిన వారు సూర్య లోకాన్ని పొందుతారని, అశ్వర్థ వృక్షం (రావి చెట్టు) ఒక్కటైనా నాటినవారు మోక్షాన్ని పొందుతారని, ఎనిమిది ఊదుంబర (మేడి) వృక్షాలు నాటిన వారు పార్వతీ దేవికి ప్రీతిపాత్రులౌతారని, ఉసిరి వృక్షాలు నాటినవారు అనేక యాగాలు చేసిన ఫలం పొందుతారని, నాలుగు ప్లక్ష (జువ్వి) వృక్షాలను నాటినవారు నిస్సందేహంగా రాజసూయ యాగం చేసిన ఫలితాన్ని పొందుతారని చెప్పుకొచ్చారు కరీం. పదిమంది కొడుకులను కనడంకంటే ఒక వృక్షం నాటడం శ్రేష్ఠమని అంతేకాదు మనం వృక్షాలను



పూజిస్తే అవి అనేక ఫలితాలనిస్తాయని నమ్ముతారాయన.

కరీం తన పేరు చెప్పకుండా మాట్లాడుకుంటూ పోతే ఈయన ముస్లిం అని ఎవ్వరూ నమ్మరు అంతటి స్వచ్ఛమైన తెలుగు ఆయనది. జ్ఞానానికి, మతానికి సంబంధం లేదని, ఏమతమైనా మానవ కళ్యాణమే కోరుతుందని నిర్దిష్టంగా చెప్పాడు. గ్రాంథిక భాషలో కూడా ఎన్నో సూక్తులను చెబుతాడు. తాను ఇప్పటికి ఎన్నో రుగ్మతలను ఎంతో మందికి నయం చేశానని, వారి కృతజ్ఞతా భావమే నన్ను ఇంకా ఎంతోమందికి వైద్య సేవ చేసే అవకాశాన్ని ఇస్తోందని త్రికరణశుద్ధిగా నమ్మాడాయన.

తాను కొన్ని రుగ్మతలకు వైద్యం చేస్తూవుంటే, తానిచ్చిన ఔషధాలలో తనకు తెలియకుండానే మరో రోగాన్ని నయం చేసే శక్తి వుందని గ్రహించాడాయన. ఒకసారి ఒక రోగికి వాతం రోగానికి మందు ఇస్తే అది వాడటం వల్ల వాతం తగ్గిపోవటంతో పాటు ఈయన ఇచ్చిన మందులలో ఒక పొడి ఆ రోగికున్న షుగర్ వ్యాధిని కూడా తగ్గించిందని తెలుసుకుని ఆశ్చర్యపోయాడు కరీం. దానిపైన ప్రయోగం చేసి ఇప్పుడు షుగర్ వ్యాధికి అద్భుతమైన మందును తయారు చేశాడు. ఇది ఎక్కడైనా దొరుకుతుంది. పూజా సామాగ్రి అమ్మే షాపుల్లో 'హెూమం పొడి' అంటే ఇస్తారు దాన్ని తెచ్చుకుని, రోజూ ఒక చెంచాడు పొడిని ఒక గ్లాసెడు నీటిలో వేసి ఆ నీరు సగం అయ్యేదాకా మరగబెట్టి మిగిలిన నీటిని వడపోసుకుని త్రాగాలి. ఇది ఒక పద్ధతి ప్రకారం త్రాగాలి. అంటే మొదట పది రోజులు ప్రస్తుతం వేసుకుంటున్న షుగర్ మాత్రలతో పాటు ఈ కషాయాన్ని త్రాగాలి, ఆ తర్వాత వరుసగా రెండు రోజులు కషాయం మాత్రమే త్రాగి మూడవ రోజు ఒక మాత్ర వాడాలి. తర్వాత మూడు రోజులు కషాయం మాత్రమే వాడి నాలుగో రోజు కషాయంతో పాటు మాత్ర వేసుకోవాలి. అలాగే రోజులు పెంచుకుంటూ, చివరి రోజున మాత్ర వేసుకుంటూ చివరికి పది రోజుల పాటు మాత్రలు వేసుకోకుండా కషాయం మాత్రమే త్రాగి, పదకొండవ రోజు మాత్ర వేసుకోవాలి. ఇలా వాడితే ఇవి యాభై రెండు రోజులు అవుతుందని, ఆ తర్వాత ఇక రెండు నెలల వరకు ఎలాంటి మాత్ర వేసుకోకుండా ఈ కషాయం మాత్రమే త్రాగితే ఇక తర్వాత ఈ కషాయం కూడా త్రాగవలసిన అవసరం లేదని నిరూపితమైంది అంటారు కరీం. అప్పుడప్పుడు షుగర్ పరీక్ష చేయించుకుంటూ ఎప్పుడైనా ఎక్కువైనప్పుడు ఒకటి రెండు రోజులు ఈ కషాయం చేసుకుని తీసుకుంటే సరిపోతుంది అంటారాయన. ఈ ఔషధం వల్ల ఆ రోగికి షుగర్ తగ్గిన తర్వాత మిఠాయిలు, అరటి, మామిడి పండ్లు తిన్నా కూడా షుగర్ పెరగదని అంటారాయన. ఈ మందు వాడటం వలన శరీర ఆరోగ్యం మెరుగుపడి ముఖ వర్చస్సు కూడా పెరుగుతుంది అంటారాయన.

ఈ మందును ఈయన ఇప్పటి వరకు రాష్ట్రంలోని ఎన్నో జిల్లాలకు పంపటమే కాక తమిళనాడు, కర్ణాటక లాంటి ఇతర రాష్ట్రాలతో పాటు, దుబాయ్‌కి కూడా సరఫరా చేశాననీ, ఇంతవరకు వాడిన ప్రతి ఒక్కరూ తాము చాలా ఆరోగ్యంగా, ఆనందంగా వున్నామని చెపుతున్నారు అంటారు కరీం.

అలాగే కొందరికి తలనొప్పి విపరీతంగా బాధిస్తూ వుంటుందని, అలాంటివారు ఏపనీ చేయలేరని, వారు 'గసగసాలు' 50 గ్రా. తీసుకుని రాత్రంతా నానబెట్టి ఉదయం ఆ నీటిని మిక్సీలో వేసి కలియబెట్టాలి. ఆ తర్వాత ఆ నీటితో





అన్నం వండాలి. ఆ నీటికి ఎంత బియ్యం సరిపోతుందో (అత్తెసరు) అంతే బియ్యం తీసుకుని అన్నం వండాలి. అందులో ఉల్లిపాయ కారం, నెయ్యి తప్పనిసరిగా వేసుకుని రెండురోజుల పాటు తింటే మన తలలో వున్న దోషాలన్నీ ముక్కుద్వారా బయటికి వెళ్ళి తల బరువు తగ్గి, చాలా హాయిగా ప్రశాంతంగా వుంటుందని అంటాడు కరీం.

అలాగే తెల్ల వెంపలి వేరును మెత్తగా నూరి మజ్జిగలో కలుపుకుని త్రాగితే ఎటువంటి కిడ్నీ వ్యాధులైన నాయమౌతాయి అంటాడు. గ్రంథాలలో దీని గుణాన్ని విశిష్ఠంగా వివరించారని, “తెల్ల వెంపలి పచ్చి వేరును పాలతో మెత్తగా నూరి మజ్జిగలో కలిపి సేవిస్తే ప్లీహ రోగాలు నయమౌతాయి. ఇది పని చేయనిచో పర్వతాలు నీటిపై తేలియాడినట్లే” అని వుందని డా. కె. నిశ్చేశ్వర్ గారు రచించిన “భావప్రకాశిక” అనే గ్రంథం లో చూపించాడు.

హెయిర్ ఆయిల్ ఒకటి తయారు చేశాడు కరీం. దాన్ని వాడితే వెంట్రులు రాలటం ఆగిపోతుంది. అంతే కాదు వెంట్రుకలు పెరుగుతాయి, నల్లబడతాయికూడా. ఇది విరివిగా అమ్ముడు పోతుతోంది. ఎంతోమంది తనవద్దకు వచ్చి ఇది తయారు చేయించి మరీ తీసుకు వెళుతుంటారు అంటారు.

ఎముకల్లో గుజ్జు తరిగిపోయి మోకాలి నొప్పులు వచ్చిన వాళ్ళకి తన ఔషధం దివ్యంగా పనిచేస్తుంది అంటారాయన. ఈ నొప్పులకి ఔషధంతో పాటు మర్దనా చేయటానికి ఒక తైలం కూడా ఇస్తాడు. ఈ మందు తిని, నూనె మర్దనా చేస్తే వందశాతం గుజ్జు పెరుగుతుంది

**వైద్యుడు తాను చేసిన మందుకు వచ్చిన ధనాన్ని ఐదు భాగాలు చేయాలి. మొదటిది ద్రవ భాగం అంటే మందు తయారీకి కావలసిన మూలికల సేకరణకు అయ్యే ఖర్చు, రెండవది దైవ భాగం, మూడవది మిత్ర భాగం, నాలుగవది సేవా భాగం (డబ్బులివ్వటం చేతకానికి వారికి వైద్యం), ఐదవది తన భాగం.**

అంటారు. ఇక్కడే ఆత్మకూరులో ఒక మహిళ నడవలేక ఇక మోకాలు ఆపరేషన్ తప్పనిసరి అనుకున్న సమయంలో వారు తనవద్దకు రాగా తాను ఇచ్చిన మందు మూడు మాసాలు వాడిందని, ప్రస్తుతం ఆమె హాయిగా నడుస్తుందని, మోకాలు ఆపరేషన్ అవసరం లేకుండానే తన నొప్పులు నయమైనందుకు ఆమె ఎంతో ఆనందంగా వుందని అంటారాయన.

తాను ఇచ్చే మందులలో కీళ్ళ నొప్పుల ఔషధం అద్భుతంగా పనిచేస్తోందని అంటారు. ఇంకా ఎన్నో రోగాలకు తాను ఔషధాన్ని తయారు చేసి ఇస్తున్నానని, భగవంతుని దయవల్ల అందరికీ నయమౌతుండటంతో తనకు మంచిపేరు ప్రఖ్యాతులు వస్తున్నాయని అంటాడు. తన ఔషధానికి రోగులను పీడించి డబ్బు వసూలు చేసే గుణం తనకు లేదని, రోగి హృదయపూర్వకంగా ఇచ్చిందే స్వీకరిస్తానని, అలాగే ఏమీ ఇచ్చుకోలేని ఎంతోమంది రోగులకు కూడా నేనే స్వయంగా ఇంటికి వెళ్ళి మందులు ఉచితంగా ఇచ్చి వస్తుంటానని అంటాడు. వైద్యుడు తాను చేసిన మందుకు వచ్చిన ధనాన్ని ఐదు భాగాలు చేయాలి.



మొదటిది ద్రవ భాగం అంటే మందు తయారీకి కావలసిన మూలికల సేకరణకు అయ్యే ఖర్చు, రెండవది దైవ భాగం, మూడవది మిత్ర భాగం, నాలుగవది సేవా భాగం (డబ్బులివ్వటం చేతకానికి వారికి వైద్యం), ఐదవది తన భాగం. అంటే తాను తయారు చేసిన మందులలో తాను ఐదవ వంతు మాత్రమే తీసుకుని చేస్తానని, తనకు ఇంతకన్నా ఎక్కువ అవసరం లేదని, దీనితోనే నేను సుఖంగా సంతోషంగా ఉన్నానని, నా మందులు వాడిన రోగులు నయమై తాను ఎక్కడైనా కనపడితే కృతజ్ఞతా భావంతో పలకరిస్తే చాలు తనకు ఎంతో ఆనందం కలుగుతుందని అంటారు కరీం. ఈ భావాన్ని అన్వయించుకున్న ఏ వైద్యుడు ఎటువంటి మందు ఇచ్చినా రోగం నయమౌతుందని అంటాడు. ఆ సూత్రాన్ని వైద్యులందరూ పాటిస్తే 'వైద్యో నారాయణ' అన్నది నిజమౌతుంది అంటారాయన.

ప్రతి ఆయుర్వేద వైద్యునికి రోగం గురించి క్షుణ్ణంగా తెలిసుండాలి, అలాగే ఆ రోగానికి ఎలాంటి మూలికలు పని చేస్తాయో గ్రహించగలిగే శక్తి వుండాలి. ప్రతి మూలిక పుట్టుకకు గ్రంథాలలో ఒక కథ వుంటుందని, ఆ కథలు కూడా తెలిసుండాలని అంటారాయన. ఎందుకంటే అలాంటి కథలు తెలిసినపుడు ఆ మూలిక ఏయే రుగ్మతలకు, రోగాలకు పని చేస్తుందో తెలుసుకోగలిగే శక్తి వస్తుంది అంటారు.

తాను ఇస్తున్న ఔషధాలలో విజయవంతంగా పని చేస్తున్న మందులు.... పైల్స్ (మొలలు), సోరియాసిస్, కీళ్ళ నొప్పులు, అనేక రకాల చర్మవ్యాధులు, ఇంకా ఎన్నో రకాల రోగాలను నయం చేయగలిగానని అంటారు.

ప్రతి మనిషి ప్రశాంత మనసుతో వుండాలంటే సరియైన నిద్ర, శృంగార నియమాలు పాటించాలని అటువంటి వ్యక్తి ముఖం మంచి వర్చస్సుతో వెలిగి పోతుందని, కాబట్టి ప్రతి వ్యక్తి పై వాటిని నియమం తప్పకుండా పాటిస్తే ఆరోగ్యంగా వుంటాడని వక్కాణించారు.

మెకానిజం, వైద్యంతో పాటు ఆయుర్వేదాన్ని, మూలికలను ప్రచారం చేయటంలో కూడా విరివిగా పాల్గొంటూ వుంటారు కరీం. ఎన్నో దేవాలయాల పుట్టు పూర్వోత్తరాలు, వాటి విశిష్ఠత ఎరిగిన వ్యక్తి ఈయన. ప్రకృతి అంటే ఆయనకు అపారమైన గౌరవం. ప్రకృతిలో అన్ని వ్యాధులకు పరిష్కారాలున్నాయని ఆయనకు పూర్తి విశ్వాసం. దానివల్లే దృఢమైన సంకల్పంతో ఆయన ప్రతి వ్యాధికి ప్రకృతిలో పరిష్కారం వెతుకుతాడు. ప్రకృతిలో ఏది చూసినా నాకు అంత ఆనందం వేస్తుంది అంటాడు. నేనే కాదు ఏ వ్యక్తి అయినా తాను గొప్పగా సంకల్పం చేసుకుంటే ప్రతి వస్తువులో ఆనందాన్ని చూస్తాడు అంటారాయన. ఏదైనా నేను తప్పక చేయగలను అని సంకల్పించుకుంటే అది తప్పకుండా నెరవేరుతుంది.

ఈ విషయాలన్నీ తాను ఎన్నో గ్రంథాలు చదివి తెలుసుకున్నానని చెపుతూ, కొప్పు సంధ్యారావు గారు రచించిన ఒక చిన్న గ్రంథం మొదట చదివి నేను ఎంతో ఉద్వేగానికి లోనై ఆ తర్వాత కర్రా విశ్వేశ్వర్, కొండపల్లి నర్సింహారెడ్డి, చిరుమామిళ్ళ మురళీ మోహన్, సుబ్రహ్మణ్యం, చక్రవర్తుల పద్మనాభ శాస్త్రి గారు లాంటి ఎందరో గొప్ప వ్యక్తులు వ్రాసిన ఎన్నో గ్రంథాలను చదివటమే కాక, వీరిలో దాదాపు అందరినీ కలిశాను, చాలామంది మహానుభావులు నా ఇంటికి కూడా వచ్చి నన్ను అభినందించారు అని సగర్వంగా చెప్పుకుంటాడు.

ప్రకృతిలో వున్న అనంత జ్ఞానాన్ని సముపార్జించి దాన్ని ప్రజల సేవకే ఉపయోగిస్తున్న అబ్దుల్ కరీం ఎన్నో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని, ఇంకెందరో వ్యక్తులకు ఆరోగ్యాన్ని సమకూర్చాలని పల్లెసృజన మనసారా కోరుకుంటోంది.

11వ చిన్నశోధయాత్రలో మన అద్భుత ఇన్నోవేటర్ వెంకటకృష్ణుడు ద్వారా పరిచయమై తన విశేష జ్ఞానంతో శోధయాత్రీకులను ఆకట్టుకున్న కరీం గారికి 'పల్లెసృజన' అభినందనలు. ఇలాంటి విశేష వ్యక్తులు లక్షకొకరుంటారు. కరీంగారు మాకు పరిచయం కావడం మా అదృష్టమని భావిస్తున్నాను.

కరీంగారి వైద్య జ్ఞానాన్ని ఎన్.ఐ.ఎఫ్.కు పంపడం, వాటిని ప్రామాణికం చేయించడం, పదిమందికి తెలిసేలా ప్రచారం చేయడం, తద్వారా సమాజానికి, కరీంగారి ప్రకృతి జ్ఞానాన్ని చేరవేయడం పల్లెసృజన ఉద్దేశ్యం.

**- ఎడిటర్**

**సాంప్రదాయ జ్ఞాని శ్రీ అబ్దుల్ కరీం చిరునామా :**

**అబ్దుల్ కరీం, ఇంటి నెం. 17-107/2, రహమత్ నగర్, ఆత్మకూరు, కర్నూలు జిల్లా. ఫోన్ : 85004 91978**




"నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్" (ఎన్.ఐ.ఎఫ్.) తేనెటీగ తత్వంపై ఆధారపడి భారత ప్రభుత్వ సైన్స్ & టెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ. ఇది "ఇగ్నైట్ జాతీయ పోటీలు" నిర్వహిస్తున్నది. ఇందులో 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు గాని, ఏ విద్యార్హతలు లేనివారు కూడా ఏ భాషలోనైనా తమ ఆలోచనలు, ఆవిష్కరణలను ఎన్.ఐ.ఎఫ్.కు **31 ఆగస్టు, 2014 లోగా** పంపగోరడమైనది. దీనికి నిర్ణీత దరఖాస్తు నమూనా ఏదీ లేదు. అయితే మీరు పంపేటపుడు మీ ఆలోచన, ఆవిష్కరణ వివరాలతో పాటు మీ వయస్సు, చదువుతున్న తరగతి, పాఠశాల పేరు, ఇంటి చిరునామా, మిమ్మల్ని సంప్రదించవలసిన ఫోన్ నెంబరు తప్పనిసరిగా జత చేయాలి. చివరి తేదీ తర్వాత అందిన దరఖాస్తులను తదుపరి 'ఇగ్నైట్-2015' పోటీలకి పరిశీలించడం జరుగుతుంది.

బాలల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్ దినంగా జరుపుకునే మన **మాజీ రాష్ట్రపతి శ్రీ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ గారి జన్మదినమైన 15 అక్టోబర్, 2014న విజేతలను ప్రకటించబడును.** ఎన్.ఐ.ఎఫ్. అవసరమైన సందర్భాలలో ఆలోచనలను మెరుగు పరచటానికి లేదా పేటెంట్ తీసుకోవటానికి కూడా తగిన సహాయం అందజేస్తుంది. ఎన్.ఐ.ఎఫ్. ఇంతకుముందే ఇగ్నైట్ పోటీలలో కొందరి పేరున పేటెంట్ హక్కులకై దరఖాస్తు చేయటం జరిగింది.

**మీ దరఖాస్తులను**

1. ఇమెయిల్ ignite14@nifindia.org ద్వారాగాని,
2. వెబ్‌సైట్ nifindia.org ద్వారా గాని,
3. క్రింద తెలిపిన చిరునామాకు గాని

**పంపవలసిందిగా కోరడమైనది.**

**దరఖాస్తులు పంపవలసిన చిరునామా**

**IGNITE 2014**
National Innovation Foundation - India
Satellite Complex, Premchand Nagar Road,
Jodhpur Tekra, Satellite, Ahmedabad 380 015, Gujarat
**Ph.- 07926732456/ 2095**

dst.gov.in honeybee.org sristi.org cbse.nic.in gian.org

# ఔషధ మొక్కలు - ఉపయోగాలు



ఎన్.ఐ.ఎఫ్. ప్రచురించిన 'ఇండియా ఇన్నోవేట్స్' పుస్తకం ఆధారంగా.....

**'తిప్పతీగ' మొక్క ఉపయోగాలు :**

రాష్ట్రంలోని ఏ పల్లెటూర్లో చూసినా కుప్పలు తెప్పలుగా తిప్పతీగ కనిపిస్తుంది. దీన్ని పనికిరాని కలుపుమొక్క అని తీసిపారేయటానికి వీల్లేదు. కొందరు తిప్పతీగలతో చీపుర్లను తయారు చేసి పశువుల కొట్టాలను శుభ్రం చేయటానికి వాడుతూ వుంటారు. కాని ఈ మొక్కలో అద్భుతమైన ఔషధ గుణాలున్నాయని చాలామందికి తెలియదు. విరివిగా దొరికే ఈ తిప్పతీగను అనేక రకాలుగా అనేక జబ్బులకి వాడుకోవచ్చు. ఉదాహరణకి ...

**పార్శ్వపు తలనొప్పి :**

పార్శ్వపు తలనొప్పి వచ్చినవారి బాధ వర్ణణాతీతం. సాధారణంగా ఎన్ని మందులు వేసినా తగ్గదనీ, సూర్యుడితో వచ్చి సూర్యుడితో పోతుందని ఒక నమ్మకం. కానీ తిప్పతీగ దీనికి మంచి మందుగా పనికి వస్తుంది. 250 గ్రా. తిప్పతీగని, 250 గ్రా. పెసలు, 250 గ్రా. నువ్వుల నూనెతో కలిపి ఈ మిశ్రమం సగం వరకు ఆవిరయ్యేలా మరగకాచి వడకట్టి ఈ కషాయాన్ని నుదిటిపై తలనొప్పి వున్నవైపు పట్టిస్తే పార్శ్వపు తలనొప్పి నుండి ఉపశమనం కలుగుతుందని అండమాన్ నికోబార్ దీవులలోని పోర్ట్‌బ్లేయర్‌లో నివసించే 'స్టడిమాన్ ఆర్కల్ పాల్' చెప్తున్నారు.

**ఉబ్బసం వ్యాధికి చికిత్స :**

చిన్న, పెద్ద తేడా లేకుండా వచ్చే వ్యాధి ఉబ్బసం వ్యాధి. ఈ వ్యాధి వచ్చినవాళ్ళు శ్వాస తీసుకోలేక, మాట్లాడటానికి కూడా కుదరక మహాయాతన పడుతూ వుంటారు. చలికాలంలోనైనా, ఎండాకాలంలో దుమ్ము వల్లనైనా, వర్షాకాలంలో తడిచినా, ముసురుకుని వున్నా ఈ వ్యాధిగ్రస్తుల బాధ వర్ణణాతీతం. ఎంతో ఖర్చుపెట్టి రకరకాల మందులు వాడుతూ వుంటారు. స్ప్రేలు కూడా వాడుతూ వుంటారు. ఇవన్నీ అవసరం లేదు, తిప్పతీగ ఆకులతో ఈ వ్యాధికి చికిత్స చేయవచ్చునని చెపుతున్నారు మహారాష్ట్ర జల్‌గావ్‌కు చెందిన 'రామ్‌బంధు మహాజన్'. ఈయన చెప్పిన పద్ధతి ప్రకారం తిప్పతీగ ఆకుల రసాన్ని తేనెతో కలిపి రెండు చెంచాల మోతాదును రోజుకి రెండుసార్లు చొప్పున 40 నుండి 42 రోజులు తీసుకుంటే మంచి ఉపశమనం లభిస్తుందట.



**జ్వరానికి తిప్పతీగతో వైద్యం :**

ఏ చిన్నపాటి జ్వరం వచ్చినా డాక్టరు దగ్గరికి పరిగెత్తడం, ఆయన వ్రాసిచ్చిన మందులు ఎంతో ఖరీదు పెట్టి సేవించడం ప్రతి ఇంట్లో జరుగుతూ వుంటుంది. చాలా ఇళ్లలో డాక్టర్‌కి, మందులకి అని నెలసరి ఖర్చుల్లో కొంత తీసి వుంచడం కూడా రివాజైపోయింది. ఇవేమీ అవసరం లేదు, సహజంగా దొరికే తిప్పతీగతో జ్వరానికి వైద్యం చేయవచ్చునని చెపుతున్నారు పశ్చిమ బెంగాల్ లోని బీర్‌బం ప్రాంత నివాసి 'సుశాంత్ కుమార్ మాంజీ'. ఈయన చెప్పే వైద్యం ప్రకారం తిప్పతీగ కాడలు 10 గ్రా. తీసుకొని, వాటికి కొద్దిగా నీరు జోడించి, కొద్దిసేపు ఉడికించాలి. చల్లారిన తర్వాత కొంత గోరువెచ్చగా వుండగానే ఆ ద్రావకాన్ని రోజుకు రెండుసార్లు చొప్పున 8 నుండి 10 రోజులు తీసుకుంటే ఎటువంటి జ్వరమైనా నయమౌతుందని చెపుతున్నారు.

**కామెర్ల వ్యాధికి తిప్పతీగతో మందు :**

కలుషిత నీటి ద్వారా వ్యాపించే వ్యాధులలో కామెర్లు ఒకటి. ఇవి పచ్చకామెర్లు, తెల్ల కామెర్లు అని రెండు విధాలుగా వస్తుంది. శరీరంలో వేడి చేసినా కామెర్లు వస్తాయట. దీనికి అలోపతిలో మందు లేదు అనేవాళ్ళూ ఉన్నారు. ఈమధ్య అప్పుడే పుట్టిన శిశువులకి ఎక్కువగా కామెర్లు వస్తున్నాయి. దీనికి ఏ రకమైన మందులు వాడినా కటిక పత్యం చేయాలనే నియమాలుంటాయి. వ్యాధి వచ్చినవారు చిక్కి శల్యమైపోవటమే కాక, సరియైన సమయంలో జాగ్రత్తపడి చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా కూడా మారే ప్రమాదముంది. ఈ వ్యాధికి తిప్పతీగతో సులభమైన వైద్యం చేయవచ్చునని చెపుతున్నారు పశ్చిమ బెంగాల్‌లోని బీర్‌బం ప్రాంతానికి చెందిన 'సుశాంత్ కుమార్ మాంజీ'. 8 అంగులాల పొడవున్న తిప్పతీగ ముక్కను ఒక గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టి ఉదయం ఈ నీటిని తాగాలి. ఇలా కొంతకాలం చేస్తేచాలు మంచి ఫలితం వుంటుంది అంటున్నారు.

**మధుమేహం (షుగర్) వ్యాధికి చికిత్స :**

ఈమధ్య చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా అందరికీ వచ్చే వ్యాధి మధుమేహం. వీరిసంఖ్య నానాటికీ పెరుగుతూనే వుంది. దీనికి చికిత్స పేరుతో కోట్ల రూపాయలు సంపాదించుకునే సంస్థలు తయారయ్యాయి. వంశపారంపర్యంగా వస్తుందని కొందరు, ఆహారపు అలవాట్ల వలన వస్తుందని కొందరు, ఎక్కువ ఆలోచనలు చేస్తే వస్తుందని కొందరు. కారణాలు ఏమి చెప్పినా ఈ వ్యాధి మాత్రం వస్తునే వుంది. లక్షలు ఖర్చు చేసి మందులు వాడుతునే వున్నారు. తిప్పతీగతో కూడా ఈ వ్యాధిని నియంత్రణ చేయవచ్చు అని చెపుతున్నారు పశ్చిమ బెంగాల్ బుర్ద్వాన్ ప్రాంత నివాసి 'శుభ్‌జ్యోతి ఛటర్జీ'. వీరు చెప్పిన పద్ధతి ప్రకారం తిప్పతీగ కాడలోంచి తీసిన రసాన్ని పరగడుపున రోజూ తీసుకుంటే మధుమేహం నియంత్రణలో వుంటుందట. ఈ విషయంలోనే అస్సాంలోని గౌహతీ ప్రాంత నివాసి 'డి.కె. పుకాన్' ఈవిధంగా చెప్తున్నారు. తిప్పతీగ ఆకులు రెండింటిని తీసుకుని ఉదయమే పరగడుపున నమిలి రసం మింగినా మధుమేహం నియంత్రణలో వుంటుందట.

**ప్రేవులలో పురుగులు :**

సాధారణంగా పురుగులు రావటం అనేది ఎక్కువగా చిన్నపిల్లల్లో, పసివాళ్ళలో జరుగుతూ వుంటుంది. తీసుకున్న

ఆహారం వంటబట్టక, జీర్ణం కాక, కడుపునెప్పితో బాధపడిపోతూ వుంటారు. చిక్కి శల్యమైపోతూ వుంటారు. ఉపేక్షిస్తే అనేక ఉపద్రవాలకు కూడా దారితీయవచ్చు. ఖరీదైన మందులు వాడేకన్నా, తిప్పతీగతోనే మంచి వైద్యం చేయవచ్చునని చెపుతున్నారు పశ్చిమ బెంగాల్ బీర్‌బం ప్రాంత నివాసి 'సుశాంత్ కుమార్ మాంజీ'. తిప్పతీగ ఆకుల రసాన్ని తాగివిస్తే పేగులలో వుండే పురుగులు నాశనమౌతాయని చెపుతున్నారు ఆయన.

**మొలలు (పైల్స్) వ్యాధికి తిప్పతీగతో చికిత్స :**

ఎక్కువసేపు కూర్చుని పనిచేసే వారికి, శరీరంలో ఉష్ణం పెరిగిన వారికి మొలలు వస్తాయి అంటారు. కారణమేదైనా ఆ వ్యాధి వచ్చినవారి బాధ వర్ణణాతీతం. కూర్చోలేరు, నిల్చోలేరు. స్వాంతన ఉండదు. బయట బజార్లో దీనికి రకరకాల మందులు వున్నా, అంత ఖరీదు పెట్టి చికిత్స చేయించేకన్నా తిప్పతీగతోనే చక్కని చికిత్స చేయవచ్చునని చెపుతున్నారు మణిపూర్‌లోని బిషన్‌పూర్ ప్రాంత నివాసి,' పుక్‌రాం అంగోబా సింగ్'. ఈయన చెప్పిన పద్ధతి ప్రకారం తిప్పతీగ భాగాలన్నీ ఒక 50 గ్రా. తీసుకొని కొద్దిగా నీరు తీసుకుని ఉడకబెట్టి, ఆరబెట్టి, ఆ భాగాలను ముద్దగా నూరి మాత్రలుగా తయారు చేసుకొని వీటిని రోజుకు మూడుసార్లు ఒకొక్కక్కటి చొప్పున ఐదు రోజులపాటు తీసుకుంటే మంచి ఉపశమనం కలుగుతుందని చెపుతున్నారు.

**ప్రాచీన గ్రంథాలలో 'తిప్పతీగ' గురించి ప్రస్తావన:**

తిప్పతీగ మొక్క వేళ్ళని పొడిగా చేసి తీసుకోవటం వలన నోటిలోని పుండ్లను నివారించవచ్చు. ఈ తీగను పొడిగా చేసుకుని తేనెతో కలిపి సేవిస్తే ఉదర సంబంధ వ్యాధులనుండి విముక్తి పొందవచ్చు. ఈ తీగలోని చేదుగుణం వలన పేగులలోనున్న పురుగులు హరించిపోతాయి. నీళ్ళ విరోచనాలు కట్టుకోవటానికి ఈ తీగను ఉడికించి, ఆ రసాన్ని సేవిస్తే మంచి ఫలితం వుంటుంది. తిప్పతీగ ముడి పదార్థంగా అనేక ఇతర ఔషధాలతో కలిపి తయారు చేసి అనేక జబ్బులకు వాడే 'గెరిఫోర్టె', 'దయాబికాన్' అనే మందులు ప్రసిద్ధి పొందాయి. అనేక రోగాల చికిత్సలో వాడుతున్నారు కనుక ఆధునిక వైద్య శాస్త్రంలో తిప్పతీగను అద్భుతమైన ఔషధంగా వర్ణించారు. క్యాన్సర్, పైత్యం లాంటి అనేక ఔషధాల తయారీతో కలుపుకుని దాదాపు 100 పేటెంట్లు తిప్పతీగ పేరున నమోదై వున్నాయి..

**'వావిలాకు' మొక్క ఉపయోగాలు:**

వావిలాకు మొక్కలు లేని గ్రామం భారత దేశంలో ఉండదేమో! ఈ చెట్లు రోడ్ల ప్రక్కన, పొలాల గట్లమీద విరివిగా కనిపిస్తూ వుంటాయి. దీనిని సాధారణంగా ఎరువులు తయారు చేయటంలో లేదా క్రిమి సంహారక మందులు చేయటంలో వాడుతారు. కానీ దీనిలోని ఔషధ గుణాలు అనేక రుగ్మతలను నయం చేయడానికి పనికి వస్తాయని చాలామందికి తెలియక పోవచ్చు. ప్రత్యేకించి నొప్పులు పోవటానికి దీనిని ఎక్కువగా వాడుతూ వుంటారు.

**చెవినుండి రసి కారుట నియంత్రణకి :**

చెవిలో కురుపు లేచినా, దెబ్బతగిలి చీము పట్టినా విపరీతమైన రసి కారటం జరుగుతూ వుంటుంది. దీనిని అశ్రద్ధ చేస్తే శాశ్వతంగా చెముడు వచ్చే ప్రమాదముంది. ముక్కుకి, చెవికి, కంఠానికి సంబంధం వుంటుంది కనుక ఈ భాగాలకి కూడా ప్రమాదం సంభవించే అవకాశముంటుంది. దీనికై చెవి, ముక్కు, గొంతు డాక్టర్ల వద్దకు పరిగెట్టేకన్నా వావిలాకుతోనే వైద్యం చెయ్యవచ్చు అంటున్నారు పశ్చిమ బెంగాల్ లోని బీర్‌బమ్ కి చెందిన 'ప్రశాంత్ కుమార్ మాంజీ'. ఈయన చెప్పిన పద్ధతి ప్రకారం వావిలాకు రసాన్ని గోరువెచ్చగా చేసి, మూడు నాలుగు చుక్కలు చెవిలో వేస్తే మంచి ఉపశమనం కనిపిస్తుంది.



**చెవి పోటు నివారణకు వావిలాకు :**

చెప్పులో రాయి, కంట్లో నలుసు, చెవిలో జోరీగ అన్నారు కానీ, దాన్ని చెవిలో పోటు అనాల్సింది. ఇది వచ్చినవారి బాధ వర్ణణాతీతం. విపరీతమైన బాధతో ముఖమంతా వాచిపోయి ఏమీ తోచక నానా ఇబ్బందీ పడుతూ వుంటారు. దీని నివారణకు రకరకాల ఖరీదైన మందులు వాడుతూ వుంటారు. అంత హైరానా పడవలసిన అవసరం లేదు, వావిలాకు వాడితే చాలు అంటున్నారు హిమాచల్ ప్రదేశ్ కాంగ్రా ప్రాంత నివాసి 'భగత్ రామ్'. వావిలాకులను కొన్నింటిని తీసుకొని ఆవనూనెలో బాగా మరిగించి వడకట్టి వుంచుకోవాలి. కొన్ని చుక్కల ఈ ద్రావకాన్ని పోటువున్న చెవిలో పోస్తే మంచి ఫలితం వుంటుందని చెపుతున్నారీయన.

**ఊబ కాయం తగ్గటానికి వావిలాకు సహాయం చేస్తుంది :**

ఆధునిక జీవన పద్ధతి వలన ఊబకాయం, బరువు పెరిగి పోవటం ఎక్కువవుతోంది. ప్రత్యేకించి కష్టించి పని చేయవలసిన అవసరం లేకుండా ఫ్యానుకింద కుర్చీలో కూర్చుని పని చేయటం కూడా దీనికి కారణం కావచ్చు. ముఖ్య కారణం మనం తినే తిండి. కొవ్వు పదార్థాలు ఎక్కువగా వుండే ఆహారం, ముఖ్యంగా పిజ్జాలు, బర్గర్లు, చాక్లెట్లు, వేపుళ్ళు మొదలైనవి దీనికి ఎక్కువ దోహదం చేస్తాయి. ఊబ కాయస్తులు కదలటం కష్టమవటమే కాక, మెట్లు ఎక్కటం, ప్రయాణాలు చేయటంలో కూడా ఇబ్బందులు పడుతూ వుంటారు. అన్నిటికీ మించి చుట్టు ప్రక్కల వాళ్ళు వీరివైపు కుతూహలంగా, ఆశ్చర్యంగా చూస్తూ వుంటారు. ఊబకాయం తగ్గిస్తామని, వారంలోనో... నెలలోనో.... బరువు తగ్గిపోతారని .... గ్యారంటీ అని, మా మందు తినకముందు, తిన్న తర్వాత అని ప్రకటనలను గుప్పిస్తూ, మార్కెట్లో అనేక కంపెనీలు వచ్చాయి. తగ్గించటమేమో కానీ, డబ్బులు మాత్రం దండుకుంటు న్నారు. ఇవేమీ అవసరం లేదు, వావిలాకు ఉంటే చాలు అని చెపుతున్నారు పశ్చిమ బెంగాల్ కంకూరా ప్రాంత నివాసి 'అరుణ్ ఘోష్'. ఈయన వావిలాకు రసం రోజూ ఒక చెంచాడు తీసుకుంటూ వుంటే కొన్నాళ్ళకు ఊబకాయం అదే పోతుంది అంటాడు.

**మధుమేహం నియంత్రణకు వావిలాకు :**

నియంత్రణే తప్ప నివారించలేని వ్యాధి మధుమేహం. ఇది రానే రాకూడదు కానీ, వస్తే మాత్రం తప్పనిసరిగా జీవితాంతం మందులు వాడతూ వుండవలసిందే. దీనికి అలోపతి, ఆయుర్వేదం, యునాని, హోమియోలో కూడా చాలా మందులున్నాయి. కానీ అన్నిటికన్నా సులభమైంది, తేలికైంది నేను చెపుతాను అంటున్నారు పశ్చిమ బెంగాం లోని బీర్‌బమ్ ప్రాంత నివాసి 'సుశాంత్ కుమార్ మాంజీ'. ఈయన పద్ధతి ప్రకారం, వావిలాకులు, బిళ్ళ గన్నేరు ఆకులు, వేపాకులు సమపాళ్ళలో తీసుకుని మెత్తగా నూరి ముద్దగా చేసి ఐదు గ్రాములు ఉండేలా మాత్రలను తయారు చేసుకోవాలి. ఈ మాత్రలను ప్రతిరోజు ఉదయం పరగడుపున రెండు మాత్రల చొప్పున తీసుకుంటూ వుంటే మధుమేహం మంచి నియంత్రణలో వుంటుందని చెపుతున్నారు.

**కీళ్ళనొప్పుల నుండి ఉపశమనానికి వావిలాకు :**

వయసుమళ్ళినవారిలో కీళ్ళనొప్పులు రావటం సహజమే అనుకున్నా ఈమధ్య యువత కూడా కీళ్ళనొప్పుల బారిన పడుతూ వున్నారు. కీళ్లల్లో వాపు కనిపించి, విపరీతమైన నెప్పి వచ్చి కదలికలు స్తంభించి పోతాయి. లేవటానికి, నడవటానికి విపరీతమైన శ్రమ పడాల్సి వస్తుంది. తాత్కాలిక నివారణకి నొప్పి నివారణ మాత్రలు వాడుతూ వుంటారు. ఇవి కొద్దిగా మేలు చేసినా కిడ్నీ, లివర్, జీర్ణకోశం లాంటి అవయవాలపై చాలా దుష్ప్రభావం చూపుతాయి. దీనికి వావిలాకుతో మంచి నివారణ పొందవచ్చు అని చెపుతున్నారు మహారాష్ట్రలోని షోలాపూర్ నివాసి 'నాగ్‌నాథ్ దుర్గా చోగ్లే'. వీరి పద్ధతి ప్రకారం వావిలాకులను వెచ్చగా చేసి, నెప్పివున్న ప్రదేశంలో కాపటం పెడుతూ వుంటే మంచి ఫలితం వుంటుంది.

**కండరాల నొప్పుల నుండి ఉపశమనానికి వావిలాకు :**

సరియైన పద్ధతిలో వ్యాయామం చేయకపోయినా, ఒక్కొక్కప్పుడు ఆటలలో లేదా అకస్మాత్తుగా కలిగే కదలికలు, ఎక్కువ నడిచినప్పుడు కూడా కండరాలపై వత్తిడి పెరిగి కండరాలలో నొప్పి వస్తూ వుంటుంది. కొన్ని సందర్భాలలో వాపు కూడా వుంటుంది. విపరీతమైన బాధతో కదలికలు

స్తంభించి కూర్చోవటం, నడవటం కూడా కష్టమవుతూ వుంటుంది. దీనికి బజార్లో రకరకాల బామ్‌లు, తైలాలు, స్ప్రేలు కూడా దొరుకుతున్నాయి. అంత ఖరీదు పెట్టి కొననవసరం లేదు, దగ్గర వావిలాకు ఉంటే చాలు అంటున్నారు బీహార్ లోని గోపాల్ గంజ్ నివాసి 'సవితా కుమారి'. వావిలాకులు కొన్నింటిని తీసుకుని, ఆవనూనెలో కాస్త వేడి చేసి గోరువెచ్చగా వున్నప్పుడే నెప్పి వున్న ప్రాంతంలో పూస్తే బాధ నివారణ అవుతుందని అంటున్నారామె.

**ప్రాచీన గ్రంథాలలో 'వావిలాకు' గురించి ప్రస్తావన:**

ఎండు వావిలాకులను నిప్పుల్లో వేసి పొగ పీలిస్తే దగ్గు నయమవుతుంది. వావిలాకు మొక్కలు చిన్న కొమ్మలను గోమూత్రంతో కలిపి శరీరానికి రాస్తే చర్మరోగాలు నయమౌతాయి. నీళ్ళ విరోచనాలు కట్టుకోవడానికి వావిలాకు పూలు పనిచేస్తాయి. వావిలాకు ముడి పదార్థంగా తయారు చేసిన 'మజిల్ & జాయింట్ రబ్' అనే క్రీము వెన్ను నొప్పి, కండరాలు పట్టేయటం, కీళ్ళ నొప్పులకి ఔషధంగా వాడుతూ వుంటారు. ఇదేవిధంగా వావిలాకుతో తయారు చేసిన డెంటల్ క్రీం వాడటం వలన చిగుళ్ళ వాపు తగ్గటం, చిగుళ్ళనుంచి రక్తం కారటం, పంటినొప్పులు తగ్గటం మాత్రమే కాక పళ్ళు గట్టి పడటం కూడా జరుగుతుంది. వావిలాకుతో తయారు చేసిన 'అధర్వ నీర్‌గుండి శుద్ధ తైలం' కీళ్ళ నొప్పుల నివారణకి వాడుతూ వుంటారు. ముఖ్యంగా నొప్పుల నివారణకు వావిలాకుపై 35 పేటెంట్లు నమోదై వున్నాయి. వావిలాకులో వుండే 'గ్రీన్ సిల్వర్ న్యానో పార్టికల్స్' ప్రభావం క్యాన్సర్ నివారణలో ఏవిధంగా పని చేస్తుందా అని పరిశోధనలు జరుగుతున్నాయి. కేవలం చర్మ రక్షణకి, కీళ్ళ నొప్పులకు సంబంధించి మాత్రమే 100 పేటెంట్లు నమోదైనాయి.

# "పల్లెసృజన సభ్యత్వం" బహుమతిగా....

## సరికొత్త సాంప్రదాయానికి నాంది

మీ ఆప్తుల వివాహ వేడుక, పుట్టినరోజు పండుగ, రిటైర్‌మెంట్ కార్యక్రమం, పెళ్ళిరోజు వేడుక ... ఇలా ఏదైనా కార్యక్రమాలకు మీరు ఏదో ఒక బహుమతి ఇవ్వడం జరుగుతూ వుంటుంది. ఆ బహుమతి కేవలం వారికి మాత్రమే ఉపయోగ పడుతుంది. కానీ, అదే బహుమతి వారికి ఉపయోగ పడటంతో పాటు సమాజానికి కూడా పనికి వచ్చేదిగా వుంటే మీ బహుమతి ఇంకా ఆనందదాయకంగా వుంటుంది కదా!.

ఇప్పటి నుండి అలా ఇచ్చే బహుమతిగా "పల్లెసృజన సభ్యత్వం" ఇవ్వండి. గ్రామీణ ఇన్నోవేషన్లు పదిమందికీ తెలియటంతో పాటు వారికి కూడా ఆనందం, తృప్తి కలిగిస్తాయి. మీరు చేయవలసిందల్లా మీరు చందాను పంపి వారి చిరునామాను ఇవ్వటమే. మీరిచ్చే బహుమతి సభ్యత్వ కాలమంతా వారికి మీరు గుర్తుండేలా చేస్తుంది.



చందా వివరాలు ఈ పత్రిక చివరి కవర్ పేజీలో ఉన్నాయి. వెంటనే అమలు చేయండి, మన గ్రామీణ ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు వచ్చి దేశ అభ్యున్నతికి పాటు పడండి. - ఎడిటర్

# 'పల్లెసృజన' ప్రగతి

✤ 146 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణ లను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్ లో చేయడం జరిగింది.

✤ ఇప్పటి వరకు 40 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది.

✤ 28 మంది ఇన్నోవేటర్లకు తమ ఇన్నోవేషన్లను కార్యరూపం చేయటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించటం.

✤ 'పల్లెసృజన' ద్వారా గుంటూరు జిల్లావాసి సయ్యద్ సుభాని సృష్టించిన 'బూమ్ స్ప్రేయర్'ను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు 2012లో రికార్డుగా నమోదు చేయడమైనది.

✤ అయిదవ జాతీయ పోటీల్లో బోయ రాజన్న, భూమయ్యచారి, నజీర్ అహమ్మద్‌లకు జాతీయ బహుమతులు మార్చి 2012లో రాష్ట్రపతి ద్వారా ప్రదానం.

✤ "సివిల్‌సొసైటీ హాల్ ఆఫ్‌ఫేం" వారు 2011లో చింతకింది మల్లేశం, 2012లో పశువైద్యంలో చేసిన గ్రామీణ సేవలకు గుర్తింపుగా బోయ పెద్ద రాజన్నలను ఎంపిక చేయటం.

✤ దేశ వ్యాప్తంగా జరిగిన 'శ్యాంసంగ్ ఇన్నోవేషన్ల పోటీ'లలో చింతకింది మల్లేశం, తొండపి గురవయ్యలకు జాతీయ బహుమతులు, నగదు, 2011, 2012లో లభించడం.

✤ 'చైనా'లో డిసెంబర్, 2012లో జరిగిన 2వ అంతర్జాతీయ పునాదిస్థాయి ఇన్నోవేటర్ల సదస్సులో 'చింతకింది మల్లేశం' అతిథిగా పాల్గొనడం,

✤ 2013 మార్చిలో రాష్ట్రపతి ద్వారా గల్లా చంద్రశేఖర్, బోయ పెద్ద రాజన్న, బొమ్మగాని మల్లేశ్‌లు రాష్ట్రపతి భవనంలో జాతీయ బహుమతులు పొందడం.

✤ 2013 మే నెలలో ప్రప్రథమంగా 'ఆంధ్రప్రదేశ్ మూలికా వైద్యుల సమావేశం' జరపడం.

✤ 2011 నుండి ఇప్పటివరకు 12 చిన్న శోధయాత్రలు వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నల్గొండ, చిత్తూరు, మెదక్, శ్రీకాకుళం, కర్నూలు, రంగారెడ్డి జిల్లాల్లో నిర్వహించడం.

✤ వెయ్యికి పైగా సాంప్రదాయ జ్ఞానాన్ని డాక్యుమెంట్ చేయడం.

✤ 13 మంది ఇన్నోవేటర్లకు పేటెంటు సంపాదించటం.

✤ 14 ఇన్నోవేషన్లు మార్కెట్‌లోకి రావడం.

✤ 30 లక్షల ఆర్థిక సహాయం గ్రామీణ ఇన్నోవేటర్లకు అందించడంలో కృతకృత్యులం కావాడం.

✤ "ఇన్నోవేషన్ల పరివ్యాప్తి కేంద్రం" సికింద్రాబాద్ లోని 'పల్లెసృజన' కార్యాలయంలో ఆగస్టు 2013 నుండి ఏర్పాటు చేసి, పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులను, రైతులను ఆహ్వానించడం

✤ ఐఐయం, ఐఐటి, బిట్స్ పిలాని, నారమ్, మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్, జపాన్ నుండి యువకులు, విద్యార్థులు, 'ఇంటర్న్‌షిప్'కై పల్లెసృజనతో సంధానం చేయడం.

✤ పందిరి పుల్లారెడ్డి, గల్లా చంద్రశేఖర్, కడివిండి మహిపాల్ చారిలను డైరెక్టరేట్ ఆఫ్ ఆయిల్ సీడ్ రీసర్చ్ (డి.ఓ.ఆర్.) సంస్థ 28 ఫిబ్రవరి2014 న సత్కరించింది.

✤ మహీంద్ర సమృద్ధి జాతీయ అగ్రి అవార్డు 2014 "కృషి సహయోగ్" తో 'పల్లెసృజన'ను సత్కరించారు.

✤ ఇన్నోవేటర్ ఇష్వాక్ ను ట్రిపుల్ ఐటి, ఆర్.కె. వ్యాలీ సత్కరించడం.

✤ చింతకింది మల్లేశం కథను కార్పోరేట్ లీడర్‌షిప్ ట్రైనింగ్ కోర్సులలో ప్రవేశపెట్టడం.

✤ ఇన్నోవేటర్ పందిరి పుల్లారెడ్డిని నల్గొండ జిల్లా కలెక్టర్ సభలో సత్కరించడం.

✤ ఆంధ్ర మహిళాసభ టెక్నో 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ తొమ్మిది మంది ఎం.బి.ఏ. విద్యార్థులు 'పల్లెసృజన' ఇన్నోవేషన్లపై ఇంటర్న్‌షిప్ చేయటం.

✤ జపాన్ నుండి పారిశ్రామిక ఒప్పందం 'పల్లెసృజన' ద్వారా చింతకింది మల్లేశంతో ఆలేరు గ్రామంలో చర్చలు జరపటం.

**మా కలలు :**

✤ తొమ్మిదవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.

✤ కనీసం ఆరుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.

✤ 2014లో పది పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం.

✤ వచ్చే 5 సంవత్సరాల్లో 'పల్లెసృజన' సభ్యత్వాన్ని 10 వేలకు పెంచడం.

**మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి.**

**ప్రోత్సహించండి - పాల్గొనండి - ఆవిష్కరించండి.**

**- బ్రిగేడియర్ పి. గణేశం,** అధ్యక్షులు,
పల్లెసృజన సంఘం.

# పల్లెసృజన తో ఇంటర్న్‌షిప్

**పల్లెసృజన గురించి :**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో గ్రామస్థాయి ఇన్నోవేషన్‌లు, సాంప్రదాయ జ్ఞానాన్ని శోధించి, వెలికి తీసే ప్రధాన ఉద్దేశ్యంతో పనిచేసే 'పల్లెసృజన' స్వచ్ఛంద సంస్థ "ఇంటర్న్‌షిప్"లను ఆహ్వానిస్తోంది. దయచేసి పూర్తి వివరాలకై మా వెబ్‌సైట్‌ని సందర్శించండి. http://www.pallesrujana.org

**ఇంటర్న్‌షిప్ యొక్క ఉద్దేశ్యాలు :**

- గ్రామస్థాయి ఇన్నోవేషన్లను – సమాజంతో సంధాన పరరచి, వాటి సామర్థ్యాన్ని, అవకాశాలను సామాజానికి మేలు కలిగేలా అధిక ఉత్పాదకతకి, వ్యాపార అవకాశాలకి ఉపయోగించటం.
- ఇంటర్న్‌లు గ్రామస్థాయి సమస్యలకు, గ్రామస్థాయి ఇన్నోవేటర్లతో కలిసి పరిష్కారాలు కనుగొనటం.

**ఇంటర్న్‌లకి లాభాలు :**

- సమాజ సేవ చేసే అవకాశం, వ్యాపార అవకాశాలు, జ్ఞాన సంపాదన, ప్రకృతి మరియు ప్రజలతో సమన్వయం.
- సమస్యలని వెతకటం, పరిష్కారాలను కనుగొనటం.
- ఒప్పజెప్పిన కార్యాలు (అసైన్‌మెంట్) ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ అందజేయబడుతుంది.

**ఎవరు దరఖాస్తు చేసుకొనవచ్చు/ అర్హత :**

- విద్యార్థులు/ ఉద్యోగం చేస్తున్న వృత్తి నిర్వాహకులు/ పదవీ విరమణ చేసిన వారు/ వ్యాపారస్తులు/ గృహిణులు – అందరూ అర్హులే. ఎవరైనా దరఖాస్తు చేసుకొనవచ్చు
- ఏదైనా సబ్జక్టులో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఆపై విద్యార్హతలు ఉన్నవారు.
- మహిళలు, పురుషులు ఎవరైనా దరఖాస్తు చేసుకొనవచ్చు.

**ఇంటర్న్‌షిప్ లో రకాలు :**

- కళాశాల విద్యార్థులకి ప్రాజెక్టులు.
- చిన్న శోధయాత్ర.
- జ్ఞానశోధ.
- ఇన్నోవేటర్లను కలుసుకోవటం.
- ప్రత్యేక ఉద్దేశ్యంతో కూడిన సామాజిక ఇంటర్న్‌షిప్.
- గ్రామ ఉత్పాదకతను బేరీజు వేయటం.

**ఇంటర్న్‌లకై ప్రణాళిక :**

- ఒక గ్రూపులో 4 లేదా 5 ఇంటర్న్‌లు ఉంటారు.
- వారికి ఒక ప్రాజెక్టు కేటాయించబడుతుంది – ఇన్నోవేషన్ పట్టిక నుండి లేదా సమస్యల పట్టిక నుండి వారు ప్రాజెక్టును ఎన్నుకొనవచ్చు.

**ఇంటర్న్‌ల పాత్ర – పరిధి :**

- ఇన్నోవేషన్‌లు, పరికరాలకు సంబంధించిన ప్రత్యేక వివరాలను తయారు చేయటం.
- వాటి 3–డి, క్యాడ్ (సి.ఎ.డి.) నమూనాలు తయారు చేయటం. ఇన్నోవేషన్ల డిజైన్ డ్రాయింగులు, ప్రొడక్షన్ డ్రాయింగ్‌లు తయారు చేయటం.
- అసెంబ్లీ డిజైను, ఉత్పాదన, మెయింటెనెన్స్, పూర్తి శక్తితో పనిచేయడం, తయారు చేయటంలో సౌలభ్యత, అందంగా కనిపించడం, చాలా పనులకు పనికి వచ్చే రీతి మొదలైన వాటిని దృష్టిలో వుంచుకొని వస్తువులని రీ–ఇంజనీరింగ్ చేయటం.
- ఉత్పత్తులను మార్కెట్ చేయటానికి సర్వేలు నిర్వహించడం.
- కొనుగోలుదారులను గుర్తించటం, వారి వివరాలను సేకరించడం – వ్యక్తులు, సహకార సంఘాలు, వారి ఆర్థిక స్థోమత, భౌగోళిక వివరాలను సేకరించడం.
- బిజినెస్ నమూనాలను డిజైన్ చేసి వ్యాపారప్రణాళికలను సిద్ధం చేయటం.
- వ్యాపారస్తుల సమన్వయంతో వస్తువును మార్కెట్‌లోకి విడుదల చేయటం.
- సాంకేతిక, సాంకేతికేతర, శాస్త్రీయ, మార్కెటింగ్ కార్యకలాపాలు అవసరమౌతాయి కనుక గ్రూపులోని వ్యక్తుల నేపథ్యాన్ని దృష్టిలో వుంచుకొని గ్రూపు ఏర్పాటు

చేయటం జరుగుతుంది. ఉదా.: ఒక గ్రూపులో ఒక కామర్స్ గ్రాడ్యుయేటు, ఒక సైన్సు విద్యార్థి, ఒక ఇంజనీరు, ఒక ఎం.బి.ఏ. విద్యార్థి, ఒక గృహిణి, ఒక సీనియర్ సిటిజన్ ఉంటారు. ఇన్ని రకాల వ్యక్తులున్న గుంపు అయితే సామాజిక అంశాల నేపథ్యంలో బాగా పనిచేసే అవకాశం వుంటుందని మా అభిప్రాయం.

- ప్రాజెక్టు రకము, వ్యక్తుల ఉత్సాహాన్ని బట్టి ఇంటర్న్‌షిప్ కాలపరిమితి వారం నుండి సంవత్సరం లేదా ఆపైన కూడా ఉండవచ్చు.
- ఇంటర్న్‌లు 'పల్లెసృజన' కార్యాలయంలో పనిచేస్తూ, గ్రామాలను సందర్శించటంతో పాటు సలహాలు చర్చలకై ఇతర సంస్థలు, వ్యక్తులు, నిపుణులను కలవాల్సి వుంటుంది.
- ప్రతి ఇంటర్న్ లేదా బ్యాచ్ లోని ఆమె/ అతను తమ కాలపరిమితి పూర్తి కాగానే సవివరంగా ఒక నివేదిక సమర్పించవలసి వుంటుంది.
- ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తిచేసిన ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్ ప్రదానం చేయబడుతుంది.

**ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలి :**

- ఉత్సాహవంతులైన అభ్యర్థులు ఈ దిగువ నున్న లింక్ https://docs.google.com/a/pallesrujana.org/forms/d/1VWL6HdxzXXTqaf6UXY8AYKPq1mgLOWQvfdqnKp9EIRE/viewform?usp=send_form ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఇంటర్న్‌షిప్ లు 1 జులై, 2014 నుండి ప్రారంభమౌతాయి. కనుక దరఖాస్తులు 1 జూన్, 2014 నుండి స్వీకరించబడును.

**సెలక్షన్ పద్ధతి, ఇంటర్న్‌షిప్‌ల సంఖ్య :**

- ఎంపిక పద్ధతికి ప్రత్యేక నిబంధనలు ఏవీ లేవు. కేవలం సాంఘిక సమస్యలపై అవగాహన, వాటిని తీర్చాలి అన్న పట్టుదల వుంటే చాలు.
- ప్రస్తుతం 40 మందిని ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక జరుగుతుంది. ఒకవేళ దరఖాస్తులు 40కి మించి వుంటే వారిని తర్వాత బ్యాచ్‌లో తీసుకొని వారికి తెలియజేయటం జరుగుతుంది.

**ఖర్చులు :**

- ఆహారానికి, ప్రయాణానికి అయిన ఖర్చులు ఎవరివి వారే భరించాల్సి వుంటుంది.
- 'పల్లెసృజన' సంస్థకు ఏలాంటి ఫీజులు చెల్లించవలసిన అవసరం లేదు.
- ఇంటర్న్‌షిప్‌లు సంవత్సరం పొడవునా స్వీకరించబడతాయి.
- ఒక బ్యాచ్ ప్రారంభం అవటానికి 15 రోజుల ముందు దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది.
- కాల పరిమితి, ప్రాజెక్టుల ఎంపిక, పద్ధతి, గుంపు ఏర్పాటు, పనిచేయవలసిన స్థలము మొదలైన వివరాలను నిర్ణయించుకునే అవకాశం ఇంటర్న్‌లకి ఇవ్వబడుతుంది.
- పనిలో నాణ్యత, సమయపాలన, తుది ఫలితము చాలా ముఖ్యం కనుక వీటిని బేరీజు వేసేపనిని 'పల్లెసృజన' చేపడుతుంది.

**– సమన్వయకర్తలు, స్వచ్ఛంద సేవకుల బృందం, పల్లెసృజన.**

**ఇతర వివరాలకై సంప్రదించండి :**

**పల్లెసృజన**

**67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,**

**సికింద్రాబాద్ – 500 090.**

ఇ–మెయిల్ : volunteer@pallesrujana.org

**ఫోన్ : రాజ్ – 78930 91114**

**సందీప్ – 87909 75313**



# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్-ఇండియా

భారత ప్రభుత్వ శాస్త్ర మరియు సాంకేతిక విభాగం

NIF-INDIA

DST

## గ్రామీణ స్థాయిలో ఏ సహాయమూ లేని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే

# జాతీయ స్థాయి 9వ ద్వైవార్షిక పోటీలు

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం తేనెటీగ (హనీబీ) తత్వంతో (పువ్వుకు హాని కలుగకుండా తేనెని అందరికీ పంచే) గ్రామ స్థాయిలో రైతులు, వృత్తి కళాకారులు, మత్స్యకారులు, మహిళలు వ్యక్తిగతంగా గానీ లేదా సామూహికంగా గానీ, మురికివాడల నివాసితులు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక గుంపుల నుంచి ఏవిధమైన సహాయమూ పొందకుండా వారికి వారే స్వతంత్రంగా రూపొందించిన ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానాన్ని కనిపెట్టిన వారివద్దనుండి దరఖాస్తులు కోరబడుతున్నాయి. ఈ ఇన్నోవేషన్లు వ్యవసాయం, యంత్రాలు, వ్యవసాయ, వ్యవసాయేతర పద్ధతులు లేదా వస్తువులు, గృహోపకరణాలు, రవాణా, శక్తి ఉత్పాదన/ ఆదాకి సంబంధించిన, శ్రమను తగ్గించేవి పర్యావరణానికి హాని కలిగించని, తక్కువ ఖర్చుతో సాంకేతిక జ్ఞానానికి సంబంధించినవై వుండాలి. అయితే ఇవి స్వంత సృజనాత్మక శక్తితో, ఎవరి సహాయమూ/ పర్యవేక్షణా లేకుండా తయారు చేసినవై వుండాలి. ఎటువంటి సంస్థల నుండి సాంకేతిక సహాయం పొంది ఉండకూడదు. మహిళలకై లేదా మహిళల ఇన్నోవేషన్లకి ఉత్తమమైన సాంప్రదాయ జ్ఞానానికి ప్రత్యేక బహుమతులు ఉన్నాయి. అదేవిధంగా అవిటివారు రూపొందించిన లేదా వారు తయారు చేసిన ఉత్తమ ఇన్నోవేషన్లకి ప్రత్యేక బహుమతులు అందజేయ బడుతాయి. ఇంకా నమూనాలు తయారు చేయని సృజనాత్మక సాంకేతిక ఆలోచనలను కూడా స్వాగతిస్తున్నాం. పాఠశాలలో చదువుకుంటున్న/ చదువుకోని పిల్లల నుండి వారి ఆలోచనలను పంపటాన్ని ప్రోత్సహిస్తున్నాము.

**బహుమతులు :** వివిధ వర్గాలలో రూ. 10,000ల నుండి రూ. 7,50,000ల వరకు అందజేయబడతాయి. 'జీవితకాల పురస్కారం' క్రింద జాతీయ స్థాయిలో మొదటి, రెండవ మరియు మూడవ బహుమతులు ఇవ్వబడతాయి. ఈ కేటగిరిలో వీరి బహుమతి సొమ్మునుంచి 15 శాతం వారు సమాజ శ్రేయస్సు, ప్రకృతి రక్షణకై ఏవిధమైన కార్యక్రమాలను ఎంచుకొని చేస్తున్నారో, వాటికయ్యే ఖర్చులకై అందజేయబడుతుంది. మొత్తం బహుమతిలో 35 నుండి 52 శాతం వరకు వారికి నెలవారీగా సహాయంగా అందించబడుతుంది.

ఇవేగాక గ్రామస్థాయిలో ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానాన్ని శోధించిన వ్యక్తులు/ సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. వ్యక్తుల జ్ఞానాన్ని, సృజనాత్మకతకి మెరుగులు దిద్ది, అభివృద్ధి పరచిన సాంకేతిక వ్యక్తులని కూడా గుర్తించడం జరుగుతుంది. అదేవిధంగా గ్రామస్థాయిలో ఇన్నోవేషన్లకు, సహాయ సహకారాలు అందించిన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాకు కూడా గుర్తింపు వుంటుంది. వారు తమ నివేదికలతో దరఖాస్తులు పంపించవలెను. వ్యక్తులు/గుంపులు తమ

**దరఖాస్తులని ఎన్.ఐ.ఎఫ్.కి 31 మార్చి, 2015 లోగా పంపించవలెను.**

<u>దరఖాస్తులు పంపించవలసిన చిరునామా</u>

**National Innovation Foundation-India**
**Satellite Complex, Premchand Nagar Road, Ahmedabad -380 015, Gujarat**
**Phone: (079) 26732456, 2095, Fax: (079) 26731903,**
**Email: campaign@nifindia.org, \Afebsite: www.nifindia.org**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన తోడ్పాటు, గుర్తింపుకు అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శక సూత్రాలకై **http:// www.nif.org.in/announcement** సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయంలో సంప్రదించండి

# రైతులకోసం రైతులు కనిపెట్టిన సేంద్రియ క్రిమి సంహారక మందులు

**పూత రాలుట నివారణకు మందు :**




ఇది నూరుశాతం ప్రకృతి సహజ వనరులతో తయారు చేసిన సేంద్రియ క్రిమి సంహారిణి. ఇది అన్ని రకాల పంటలలో పూత రాలుటను నివారిస్తుంది. ఈ ఔషధము వృక్షాలకు, మొక్కలకు, వాణిజ్య పూల మొక్కలకు కూడా వాడవచ్చు. ఈ ఔషధము కూరగాయలు, మామిడి, జామ, అరటి, మల్లె పంటలలో పూత రాలుట నివారించటమే కాక, పంటల వృద్ధికి కూడా తోడ్పడుతుంది. పూత ఒత్తుగా రావటానికి తోడ్పడుతుంది. ఈ సేంద్రియ మందు వాడటం వలన ఇతర ఇబ్బందులు ఏమీ లేకుండా, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఫలితాన్ని సాధించవచ్చు. ఈ మందు వినియోగ దారుల అవసరానికి తగ్గ మోతాదుల్లో లభిస్తుంది.

**మందు వివరాలు :**

బ్రాండు పేరు : సృష్టి ప్రయాస్
క్యాటగిరి : వ్యవసాయ క్రిమి సంహారక ఔషధం.
ఉపయోగం : పూత రాలుటను నివారిస్తూ అధిక దిగుబడికి తోడ్పడుతుంది.
ప్యాకింగ్ సైజు : 100 మిలీ., 500 మి.లీ.
వాడే విధానం : ఒక లీటరు నీటిలో 2 మి.లీ. మందును కలిపి పంటపై పిచికారి చేయవలెను.

**ప్రత్తి పంటలో పురుగుల నివారణకు :**



ప్రత్తి పంటలో పురుగుల ఉధృతి ఎక్కువగా వుంటుంది, ఎన్ని రకాల చీడపీడలను తట్టుకునే రకాల విత్తనాలు వాడినా ఈ సమస్య అధికంగానే వుంటోంది. ప్రత్తి పంటలో పురుగులను నివారించటానికి 100 శాతం సేంద్రియ పద్ధతిలో తయారైన క్రిమి సంహారక మందును అందజేస్తున్నాము. ఈ మందు ప్రత్తి పంటలో రసం పీల్చే పురుగు, కాయ తొలిచే పురుగులు, తెల్లదోమలను సమర్థవంతంగా నివారిస్తుంది. ఇది చవకైనది, ప్రకృతి సిద్ధంగా తయారు చేయబడినది. సాధారణంగా ప్రత్తి సాగులో పురుగుల నివారణకి రకరకాల పద్ధతులు వాడాల్సి వస్తుంది, ఇవన్నీ రైతుకు ఖర్చుతో కూడుకున్నవి. ఈ ప్రత్తి మందు వినియోగ దారుల అవసరానికి తగ్గ మోతాదుల్లో లభిస్తుంది.

**మందు వివరాలు :**

బ్రాండు పేరు : సృష్టి రక్షక్
క్యాటగిరి : వ్యవసాయ క్రిమి సంహారణ మందు
ఉపయోగం : గ్రోత్ ప్రమోషన్ (మొక్క ఎదుగుదల), సమర్థవంతంగా ప్రత్తి పంటలో పురుగుల నివారణ
ప్యాకింగ్ సైజు : 100 మిలీ., 500 మి.లీ.,
వాడే విధానం : ఒక లీటరు నీటిలో 2 మి.లీ. మందును కలిపి పంటపై మొక్క ఆసాంతం తడిచేలా పిచికారి చేయవలెను.

**కావలసినవారు సంప్రదించవలసిన చిరునామా :**


**Dr. Nirmal Shankar Sahay, Sristi**
Address : A. E. S. Boys Hostel Campus, Near University Library, Navrangapura
Ahmedabad, Gujarat - 380 009 (India)
Phone : +(91)-(79)-27912792/27913293
Fax : +(91)-(79)-27913293, E-Mail : sristi100@gmail.com
Send SMS / Call Us : 09953356815

PALLESRUJANA Telugu Bi-monthly 20/- May-June 2014 RNI No. APTEL 12136/01/01/2011-TC

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 25/-లు మాత్రమే










**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్: 040-27111959, సెల్: 9866001678

E-mail : honeybeeap@gmail.com, Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904